
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

శుక్రవారం 21 జూన్ 2024





'సోమశిల'కు 4,908 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురువారం 4,908 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 9.772 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు.



వారంతా దినసరి కూలీలు.. మధ్యాహ్నం వరకు పనులు చేసిన వేసవి తీవ్రతను భరించలేక ఇళ్లకు చేరుకున్నారు. ఇంటిల్లిపాది భోజనం ముగించుకుని అంతా నిద్రలోకి జారుకున్నారు. ఏం జరిగిందో ఏమో అటు కునుకు తీశారో లేదో ఇళ్లంతా పొగ కమ్మేసింది. ఆ ఘాటు వాసనకు తేరుకు న్న వారంతా ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. నిమిషాల వ్యవధిలో ఇంటింటికి మంటలు వ్యాపించాయి. చుట్టేస్తున్న మంటలను ఆర్పేందుకు ఎంత శ్రమించినా వీలుకాకపోవడంతో వృద్ధులు, పిల్లలను ప్రాణాలతో బయటకు తీసుకొచ్చారు. చివరు అగ్నిమాపక దళం రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చింది. మంటల్లో చిక్కుకుని ఓ దివ్యాంగురాలు సజీవదహనమైంది. సర్వం కోల్పోయి బాధితులు ఒట్టిచేతులతో రోడ్డుపై నిలబడ్డారు. నెల్లూరులోని రంగనాయకులపేట సమీపంలోని బర్మాషెల్‌గుంటలో గురువారం మధ్యాహ్నం జరిగిన భారీ అగ్నిప్రమాదం పేదల జీవితాల్లో తీవ్ర విషాదం నింపింది.

- నెల్లూరు (క్రైం)

అగ్నికీలల్లో కూలిన బతుకులు



- నెల్లూరులో భారీ అగ్నిప్రమాదం
- పూర్తిగా దగ్ధమైన 12 పూరిళ్లు
- ఇళ్లలో నుంచి పరుగులు తీసిన పేదలు
- దివ్యాంగురాలు సజీవ దహనం
- మరో ఇద్దరికి గాయాలు
- రిక్తహస్తాలతో రోడ్డుపైకి బాధితులు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్
- మంత్రి నారాయణ తక్షణ సాయం
- బాధితులకు టీడీపీ నేతల పరామర్శ
- మంత్రి ఆనం, ఎంపీ వేమిరెడ్డి దిగ్భ్రాంతి

నగరంలోని పాతచెక్‌పోస్ట్ వద్ద ఉంటున్న పేదలను రైల్వేలైను విస్తరణ పనుల కోసం ఐదేళ్ల క్రితం రంగనాయకులపేట రైల్వేగేటు సమీపంలోని బర్మాషెల్ గుంటకు తరలించారు. తమ ఆర్థిక స్తోమతను బట్టి పూరిళ్లు, రేకుల ఇళ్లు నిర్మించుకుని దినసరి కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో తూర్పు వైపు ఉండే పూరిళ్లలో మంటలు వ్యాపించాయి. పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇళ్లకు చేరుకున్న స్థానికులు భోజనం ముగించుకుని నిద్రలోకి జారుకున్నారు. అయితే, ఉన్నట్టుండి ఇంట్లోకి పొగలు రావడం గమనించిన కొందరు కేకలు వేయడంతో అందరూ ఇళ్లలో నుంచి పరుగులు తీశారు. అప్పటికే తూర్పువైపు ఉన్న ఆరిళ్లకు మంటలు వ్యాపించాయి. చూస్తుండగానే మంటలు పడమర వైపు ఉన్న ఇళ్లకూ వ్యాపించాయి. దీంతో చేసేది లేక బాధితులు ఇళ్లలో ఉన్న వారిని బయటకు తీసుకు వచ్చి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించారు. మంటలను అదుపు చేసే సమయంలోనే ఇంట్లోని గ్యాస్ సిలిండర్లు లీక్ అయి మంటలు ఉవ్వెత్తున 50 అడుగులకుపైగా ఎగిసి పడ్డాయి. జయమ్మ అనే వృద్ధురాలిని ఇంట్లో నుంచి బయటకు తీసుకువస్తుండగా వృద్ధురాలితోపాటు చంద్రకూ గాయాలయ్యాయి. ఇళ్లకు దగ్గర్లో ఉన్న చెత్త కుప్పల్లో మంటలు చెలరేగడంతో ఆ అగ్గిరవ్వలు ఇళ్లపై పడి మంటలు వ్యాపించాయా!? లేదా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లలో మంటలు చెలరేగాయా అన్నది విచారణలో తేలాల్సి ఉంది. కాగా ఆ ఘటనలో రూ.20 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు.



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక దళం



దహనమవుతున్న బైక్

మంత్రి నారాయణ తక్షణ సాయం

అగ్ని ప్రమాదంపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతురాలు నాగలక్ష్మి కుటుంబానికి రూ.50 వేలు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు తక్షణ సాయం కింద రూ.15 వేలు సాయం ప్రకటించారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ ముప్పాళ్ల విజేత, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, పలువురు నాయకులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలిచారు. మంత్రి నారాయణ ప్రకటించిన తక్షణ ఆర్థిక సాయాన్ని అజీజ్ బాధితులకు అందజేశారు. కాగా, అగ్నిప్రమాదంపై నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి నారాయణతో కలిసి బాధితులను ఆదుకుంటామని తెలిపారు.

బాధితులను ఆదుకుంటాం : ఆనం

భారీ అగ్ని ప్రమాదంపై రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన దివ్యాంగురాలు కుటుంబాన్ని ఆదుకుంటామని, బాధిత కుటుంబాలకు తప్పకుండా అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా బాధితు లకు ఇవ్వవలసిన సహాయం వెంటనే అందజేయాలని, మంత్రి నారాయణతో చర్చించి అధికారులను ఆదేశాలు ఇచ్చామన్నారు. ఆ కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

దివ్యాంగురాలి సజీవదహనం



మృతురాలు నాగలక్ష్మి (ఫైల్)

సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం మూడు ఫైరింజన్లతో ఘటనా స్థలికి చేరుకుంది. పూరిళ్లు కావడం, లోపల గ్యాస్ సిలిండర్లు లీక్ అవడంతో మంటలు ఉవ్వెత్తున ఎగిసి పడ్డాయి. డీఎఫ్ఓ వాకా శ్రీనివాసరెడ్డి, ఏడీఎఫ్‌ఓ వేణుగోపాల్‌లు తమ సిబ్బందితో సుమారు రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. మంటలను పూర్తిగా ఆర్పి వేసిన సమయంలో ఓ ఇంట్లో మృత దేహం కనిపించింది. జయ రాం, కృష్ణవేణి దంపతుల కుమార్తె నాగలక్ష్మి (40)గా గుర్తించారు. తల్లిదండ్రుల మృతితో దివ్యాంగురాలైన నాగలక్ష్మి తన అన్న శంకర్ సంరక్షణలో ఉంటోంది. నాగలక్ష్మి మృతదేహాన్ని చూసి బంధువు, స్థానికులు కంటతడి పెట్టుకున్నారు.

కలెక్టర్ పరిశీలన

సంఘటనా స్థలాన్ని కలెక్టర్ హరి నారాయణన్ పరిశీలించారు. అగ్నిప్రమాదం జరిగిన తీరును అగ్నిమాపక శాఖ అధికారులను, నవాబుపేట పోలీసులను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగురాలి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధితులకు ప్రభుత్వ పరంగా అందవలసిన ప్రయోజనాలను తక్షణమే అందిస్తామని హామీ ఇచ్చారు.



కాలిపోయిన ఆభరణాలు, నగదు



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్



మంటల్లో చిక్కుకొని గాయపడిన జయమ్మ

జీవన యోగం!

- యోగముద్రలో ప్రపంచం
- దీర్ఘకాలిక రోగాలకు సరైన చికిత్స
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



బిజీలైఫ్.. రకరకాల ఒత్తిళ్లు.. ఎక్కడాలేని స్ట్రెస్.. దీనికి తోడు మెకాన్రన్ లైఫ్.. ఫుడ్‌హాబిట్స్.. మనిషిని రకరకాల రోగాలతో ముంచెత్తుతున్నాయి. మెడికల్ ఫీల్డ్ ఎంత ముందడుగు వేసినా లైఫ్‌స్టైల్.. మానసిక సమస్యలకు పూర్తిగా పరిష్కారం చూపలేని పరిస్థితి. ఇలాంటి సమయంలో ఆరోగ్యానికి, ప్రశాంతతకు మారుపేరుగా మారింది యోగా. ఎలాంటి రోగాలైనా, మానసిక సమస్యలైనా దూరం చేసే శక్తి యోగాలో ఉందని ఒకప్పుడు ప్రపంచానికి పరిచయం చేశారు మన యోగా గురువులు. ఆలస్యంగానైనా ఇది నిజమని ఒప్పుకుంది ప్రపంచం. అందుకే ఏడాదిలో ఒకరోజు యోగాడే జరుపుకునేందుకు ఐక్యరాజ్యసమితి తీర్మానించింది. అసలు ప్రపంచం మొత్తం యోగాకు ఇంత ప్రాధాన్యత ఎందుకిస్తోంది. యోగాలో ఏముంది? యోగాడేను నిర్వహించడానికి కారణమేమిటి అన్న అంశాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

- నెల్లూరు (విద్య)

పతంజలి సూత్రాలు చెప్పాడు.. వివేకానందుడు ప్రపంచానికి పరిచయం చేశాడు.. ఆ యోగాకే ప్రపంచం ఇప్పుడు దాసోహం అంటోంది. ఒకప్పుడు యోగాకు మతం ముద్రవేసి లైట్‌గా తీసుకున్న దేశాలే ఇప్పుడు సలాం చేస్తున్నాయి. మానసిక ప్రశాంతత, శరీరానికి స్థిరత్వం యోగా చేసేవారిలో కనిపించే లక్షణాలు ఇవి. బిజీ ప్రపంచంలో లైఫ్ చాలా గం దరగోళంగా మారింది. దాన్ని సులువు చేసేందుకు యోగా సరైన మార్గమని నమ్ముతోంది ప్రపంచం. నమ్మడమేమిటి ఆచరిస్తోంది కూడా. యోగాను బయటి ప్రపంచానికి స్వామి వివేకానంద పరిచయం చేశారు. ప్రముఖ యోగా గురువులు జీకేఎస్.అయ్యంగార్ వంటి మహా మహుల కృషితో యోగా ఆదరణ ప్రపంచవ్యాప్తం అయ్యింది. ప్రపంచంపై కర్రపెత్తనం చేసే అమె రికా కూడా యోగాకు దాసోహం అయ్యింది. ఓబామా అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమ యంలో ఈస్ట్రన్‌డే సందర్భంగా యోగాకు అను మతి ఇచ్చారు. వైట్‌హౌస్‌లోని ఓ భవనాన్ని యోగా గార్డెన్ అని పేరు పెట్టారంటే యోగాకున్న ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు.

యోగాతోనే ఆరోగ్యం...

జీవనశైలిలో వచ్చిన మార్పులకు శారీరక రుగ్మతలు, మానసిక ఆందోళనలు, నిరాశ, నిస్పృహలు, కోపతాపాలు ఇలా ఎన్నో మనిషి జీవితంలో భాగమయ్యాయి. ఫలితంగా నిత్యం అశాంతి, అసంతృప్తి, వీటినుంచి బయట పడడానికి రకరకాల మార్గాల్లో ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ ప్రయత్నంగా వీటిలో నుంచి బయటపడే మార్గం తెలిస్తే...? అలాంటి అవకాశం ఏదైనా ఉందంటే అది ఖచ్చితంగా యోగా నే...అందుకే ప్రపంచ దేశాల చూపు ఇప్పుడు యోగాపై మళ్లింది. నిత్యం యోగా సాధన చేస్తే రక్త ప్రసరణ క్రమంగా జరిగి మానసిక ప్రశాంతత చేకూరుతుంది..జ్ఞానశక్తి వృద్ధి చెందుతుంది. చెడు అలవాట్లకు దూరంగా ఉంచుతుంది. ఒత్తిడి నివారణకు యోగా మంచి మార్గం..మనస్సును ప్రశాంతంగా ఉంచుతుది. ఏకాగ్రతను పెంపొందిస్తుంది. ఆత్మస్థైర్యాన్ని పెరుగుతుంది. ఏదైనా సాధిస్తామన్న నమ్మకం కలుగుతుంది.

ప్రధాని విశేష కృషి



కావలి : పాతూరు మున్సిపల్ పాఠశాలలో యోగా శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

భారత్‌లో పుట్టిన యోగాను విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రధాని మోదీ ఎంతో కృషి చేశారు. 2014 సెప్టెంబరులో అమెరికా పర్యటనకు వెళ్లిన మోదీ ఐక్యరాజ్య సమితిలో యోగాడే గురించి ప్రతిపాదించారు. సరిగ్గా మూడునెలల తర్వాత యోగాడేను ప్రకటన చేస్తూ ఐక్యరాజ్య సమితి తీర్మానం చేసింది. 193 సభ్యదేశాలున్న ఐక్యరాజ్యసమితిలో మోదీ ప్రతిపాదనకు 177 దేశాలు మద్దతు పలికాయి. ప్రతి ఏటా జూన్ 21వతేదీన ప్రపంచ యోగాడేను పాటించేందుకు 177 దేశాలు అంగీకరించాయి. యోగా ఆరోగ్యకరమైన జీవనశైలిని మనిషికి పరిచయం చేస్తుంది. ప్రకృతి సహజ సూత్రాన్ని గౌరవించడం నేర్పుతుంది. శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడే ఈ ప్రక్రియ విశిష్టత, విలువను ఐక్యరాజ్యసమితి గుర్తించడం దేశానికే గర్వకారణం.

ప్రధాన ఆసనాలు

పతంజలి మార్గదర్శకాల్లో ముఖ్యంగా ఐదు ఆసనాల గురించి చెప్పారు. పటయోగా, విన్యాసయోగా, అష్టాంగ యోగా, అయ్యంగార్ యోగా, విక్రమ్ యోగా లాంటివి ఉన్నాయి. వీటితోపాటు పవర్ యోగా, ఆనందయోగా, ఫేస్‌యోగా అంటూ రకరకాల యోగాలు పుట్టుకొచ్చాయి. అత్యంత కష్టతరమైనది హఠయోగా. 15వ శతాబ్దంలో అందుబాటులోకి వచ్చిన హఠయోగా అంటే ప్రాణాయామం. శ్వాసమీద అదుపు సాధించడం. అలాగే ధ్యానం చేయడం. విన్యాసయోగా కూడా ప్రాణాయామం లాంటిదే. సూర్యనమస్కారాలు చేస్తూ 12 ఆసనాలు వేయాల్సి ఉంటుంది. అష్టాంగ యోగా అంటే 8 అంగాలను బ్యాలెన్స్ చేసేది. దీనిద్వారా ఊపిరి తిత్తులు, కాలేయం, గుండెలాంటి అవయవాలు పాడవకుండా ఉంటాయి. అయ్యంగార్ యోగా కూడా అలాంటిదే. విక్రమ్ యోగాలో 26 కఠిన ఆసనాలుంటాయి. 8 అంగాలను స్ట్రెస్ చేస్తూ చేయాల్సి ఉంటుంది. గాయాల నుంచి త్వరగా కోలుకునేందుకు ఈ యోగా ఎంతో ఉపయోగపడుతుంది. ఇటీవల కాలంలో పవర్‌యోగా, ఫేస్‌యోగాలు కూడా పాపులర్ అయ్యాయి.

నిత్యయోగాతోనే ఆరోగ్యం



అన్ని వ్యాయామాల కంటే యోగా సాధన ఎంతో విశిష్టమైనది. మనసు బుద్ధిని, అహంకారాన్ని జయించి అంతశ్శాంతిని కలిగిస్తుంది. యోగాలో యమము, నియమము, ఆసన, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధ్యానము, ధారణ, సమాధి అనే ఎనిమిది సాధనాలు ఉన్నాయి. ఒక్కో సాధనంలో ఒక్కో విశేషం దాగుంది. నిత్యం వీటిని సాధన చేస్తే జీవనశైలిని క్రమబద్ధీకరిస్తుంది. యోగాతో శ్వాస పెరిగి రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది. అంతర్గత అవయవాలు ఉత్తేజంగా తయారై మానసికంగా పరిపూర్ణత కలుగుతుంది.

- ముప్పిరాల నరసింహశాస్త్రి, యోగా గురువు

శ్వాస ఒక దివ్యఔషధం



అన్ని వయసుల వారికీ యోగా సాధన శ్రేష్ఠమైనది. యోగా సాధన వల్ల శారీరక, మానసిక, బుద్ధి, ఆధ్యాత్మిక బలాలు చేకూరుతాయి. ప్రజలంతా యోగా ప్రాముఖ్యాన్ని గుర్తించి నిత్యం సాధన చేయాలి. శ్వాస బాగా తీసుకుంటే ఆక్సిజన్ అధికమొత్తంలో కణాలకు అంది శరీరంలోని అన్ని భాగాలు ఆరోగ్యంగా ఉంటాయి. కరోనా లాంటి మహమ్మారిని జయించేందుకు కూడా యోగా ఎంతో ఉపకరించింది. నిత్యం ఇంటిలో యోగా సాధన చేయడంతోపాటు ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ ఇంటి వద్దనుంచే టీవీల్లో చూస్తూ యోగాసనాలు చేయాలి.

- ప్రసన్నకుమార్, యోగా మాస్టర్



సింహ వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

సింహ వాహనంపై చాముండేశ్వరిదేవి

ఇందుకూరుపేట, జూన్ 20: మండలంలోని గంగపట్నంలోని చాముండేశ్వరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సింహ వాహనంపై అమ్మవారు పురవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి బండి శాంతయ్య, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



సెంచరీకి చేరిన టమోటా

అనంతసాగరం : టమోట ధరకు రెక్కలు రావడంతో సామాన్యులకు చుక్కలు కనిపిస్తున్నాయి. మొన్నటి వరకు కేజీ రూ.70 పలకగా నేడు రూ.90 నుంచి 100లకు చేరింది. వారం రోజుల వ్యవధిలో టామోటా బాక్సు ధరలో భారీగా మార్పు వచ్చినట్లు వ్యాపారులు తెలిపారు. 24 కేజీల బాక్సు రూ.1500 నుంచి 1900లకు చేరింది. ఎండ తీవ్రత అధికంగా ఉండటం, డిమాండుకు తగ్గట్టు ఉత్పత్తి లేకపోవడంతోనే ధర పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. కాగా, అమాంతం పెరుగుతున్న టమోటా ధరను చూసి సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.

క్రీడాకారులకు బహుమతులు


బహుమతులు అందుకున్న క్రీడాకారులతో వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి

వెంకటాచలం, జూన్ 20: స్థానిక విక్రమ సింహపురి యూని వర్సిటీ పరిధి లోని అనుబంధ కళా శాలల క్రీడాకారులకు వర్సిటీ వీసీ సుందర వల్లి గురువారం బహు మతులు అందజేశారు. స్పోర్ట్స్ మెరిట్ స్కాలర్ షిప్ సాధించిన 25 మంది పురు షులు, 15 మంది మహిళలు ఒక్కొక్క రికి రూ.3 వేలు చొప్పున బహుమతి అందజేశారు. అలాగే అంతర కళాశాలల టోర్నమెంట్‌లో ఇన్‌డివి డ్యువల్ చాంపియన్ షిప్ సాధించిన పురు షుల విభాగంలో కావలిలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాలకు చెందిన మహేష్ బాబు, మహిళల విభాగంలో నెల్లూరులోని డీకేడబ్ల్యూ కళాశాలకు చెందిన ఎం సుప్రియ ఒక్కొక్కరికి రూ. 5వేలు చొప్పున, ఇన్‌స్టిట్యూషనల్ చాంపియన్ షిప్‌లో మహి ళల విభాగంలో నెల్లూరులోని డీకేడబ్ల్యూ, కావలిలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాలకు రూ.25 వేలు చొప్పున, ఆల్ ఇండియా గ్రాప్లిగ్ స్పోర్ట్స్‌లో రజిత పతకం సాధించిన నెల్లూరు లోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం నరేంద్రకు రూ.15వేలు పారితోషికాన్ని అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీ రామచంద్రారెడ్డి, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ కే సునీత తదితరులు పాల్గొన్నారు.

నీట్ మళ్లీ జరపాలి

- ఎన్‌టీఏను రద్దు చేయాలి
- విద్యార్థి సంఘాల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నెల్లూరు (విద్య), జూన్ 20 : నీట్ ఫలితా లపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యా యం చేయాలని, ఆ పరీక్ష ను మళ్లీ నిర్వహించాల ని, నేషనల్ టెస్ట్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని వెంటనే రద్దు చేయాలని విద్యార్థి సం ఘాలు డిమాండ్ చేశా యి. ఈ మేరకు నెల్లూ రులో వీఆర్సీ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట గురువారం ఆందోళన చేపట్టాయి. అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఆ పరీక్షకు దేశవ్యాప్తంగా 24 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే అందులో 23.33 లక్షల మంది హాజర య్యారని, వీరిలో 67 మంది విద్యార్థులకు ఆలిండియా ర్యాంకులు వచ్చాయన్నారు. వారిలో కూడా టాప్ స్కోర్ సాధించిన ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే పరీక్ష కేంద్రంలో పరీక్షకు హాజరు కావడం గమనార్హమని తెలిపారు. రెండో ర్యాంకు కూడా అదే పరీక్ష కేంద్రంలో రాసిన విద్యార్థులకే వచ్చాయన్నారు. ఇది ఎలా సాధ్యమని, దీనిపై ఎన్‌టీఏను వివరణ కోరగా విద్యార్థులకు ఆలస్యంగా పరీక్ష మొదలైన కారణంగా మార్కులు కలిపామని సమాధానం చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఫలితాల విడుదల కూడా పారదర్శకంగా జరగ లేదన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి వైద్య విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు శివమ్ వర్మ, అక్షయ్, సాయి, ప్రతాప్, అల్తాఫ్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ జరపాలి....

నీట్ పరీక్ష అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. వీఆర్సీ సెంటర్‌లో గురువారం నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర మాట్లాడుతూ నెట్ పరీక్షపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆ పరీక్షను రద్దు చేశారని, మరి నీట్‌ను రద్దు చేసే ప్రయత్నాలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని, ఎన్‌టీఏ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు విష్ణు, శివశంకర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కాళ్లు చేతులు కట్టేసి.. కంట్లో కారం కొట్టి..

- వృద్ధురాలి మెడలో సరుడు దోపిడీ
- కుల్లూరులో ఘటన


బాధితురాలు మాలె పెంచలమ్మ

కలువాయి, జూన్ 20: ఒంటరిగా ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలి కాళ్లు చేతులు కట్టేసి... కంట్లో కారం కొట్టి మెడలో ఉన్న బంగారు సరు డును దుండగులు లాక్కెళ్లిన సంఘటన బుధవారం రాత్రి కుల్లూరులో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితురాలి సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన మాలె పెంచలమ్మ (65) ఒంటరిగా నివాసం ఉంటోంది. రోజులాగే రాత్రి కూడా ఇంటి గ్రిల్స్ గేటు పెట్టుకుని లోపల నిద్రిస్తోంది. అర్ధరాత్రి సమయంలో ఇద్దరు దుండగులు ఇంట్లోకి ప్రవేశించారు. వారిని పెంచలమ్మ గమనించడంతో ఆమె మొఖంపై గుడ్డతో అదిమిపెట్టి కాళ్లు చేతు లు కట్టేశారు. కంట్లో కారం కొట్టి మెడలో ఉన్న బంగారు సరుడు తీసు కున్నారు. ఆమె చేతికి ఉన్న బంగారు గాజును కూడా దుండ గులు పెరుకుని పోయే ప్రయత్నం చేయగా అది జారి ఇంట్లోనే పడిపోయింది. కంట్లో కారం మంట తట్టుకోలేక వృద్ధురాలు కేకలు వేయడంతో చుట్టు ప్రక్కల వారు విని వచ్చారు. ఇది గమనించిన దుండగులు అక్కడి నుంచి పరారైయ్యారు. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ అయ్యప్ప గ్రామానికి చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. దుండగుల ఆచూకీ కోసం ఆరా తీశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సముద్రంలో మునిగి విద్యార్థి మృతి

- మైపాడు బీచ్‌లో విషాదం


మృతిచెందిన గోపీకృష్ణ

ఇందుకూరుపేట, జూన్ 20 : సముద్రంలో మునిగి విద్యార్థి మృతిచెందిన సంఘటన మండలంలోని మైపాడు బీచ్ లో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. స్థాని క ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఐదుగురు సర దాగా గడిపేందుకు మైపాడు బీచ్‌కు వచ్చారు. వెంకటాచలం మండలం గుడ్లూరువారిపాలెంకు చెందిన ఎం గోపీకృష్ణ (21) అనే విద్యార్థి ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగిపోవడంతో తోటి విద్యార్థులు రక్షించి ఒడ్డుకు చేర్చి కొనఊపిరితో ఉన్న అతడిని మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లగా డాక్టర్లు వైద్యపరీక్షలు నిర్వహించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

'ఫోర్జరీ' నిందితులపై క్రిమినల్ కేసులు పెట్టాలి : సీపీఐ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 20 : నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ నగర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సమితి నాయకులు గురువారం జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్‌కు వినతిపత్రం ఇచ్చారు. సమితి కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా నిర్మి స్తున్న భవనాలకు సంబంధించి పత్రాల జారీలో కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి అక్యూపెన్సీ సర్టిఫికెట్ లేకుండా మార్టిగేజ్ విడుదల చేశారని చెప్పారు. దీనిపై శాఖాపరమైన విచారణ జరిపి ఏమీ లేదని తేల్చడంతో విజిలెన్స్ జరుపుతున్నట్లు వార్తలొస్తున్నాయన్నారు. ఫోర్జరీకి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించమని కమిషనర్‌కు సిఫార్సు చేస్తానని జేసీ చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పీ జిలానీ ఖాన్, సీపీఐ నాయకులు వాటంబేటి నాగేంద్ర, పీ లీలామోహన్, ముక్తియార్, వనజ, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.


జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అరిగెల నాగేంద్రసాయి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	150
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	294
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6850
వెండి కిలో ధర	రూ. 92,600
వెండి ఒక గ్రాము	రూ. 94.60


జాయింట్ కలెక్టర్ మాధవన్‌ను సన్మానిస్తున్న ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, మురళి తదితరులు

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

- అన్ని డివిజన్లలో నిర్వహణ
- నెల్లూరులో జేసీ, డీఆర్వోకు సన్మానం

నెల్లూరు(హరనాథపురం), జూన్ 20 : జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ దినోత్స వాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అన్ని డివిజన్ కేంద్రాల్లో, తహసీ ల్దారు కార్యాలయాల్లో ఈ వేడుకలు జరుపుకున్నారు. తొలిసారి రెవెన్యూ దినోత్స వం నిర్వహిస్తుండటంతో అధికారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రెవెన్యూ శాఖ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా జూన్ 20వ తేదీని రెవెన్యూడేగా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో వేడుకలు జరుపుకున్నారు. ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచల రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, డీఆర్వో లవన్నను ఘనంగా సన్మా నించారు. ఏపీఆర్ఎస్ఏ కార్యాలయంలో విశ్రాంత తహసీల్దార్ రామలింగేశ్వరరావును సత్కరించారు. నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో విశ్రాంత తహసీల్దార్ మనోహర్ బాబును సన్మానించారు. కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం, కోవూరు తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ఏపీఆర్ఎస్ఏ నాయకులు బొబ్బా మురళి, డేనియల్ పీటర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పైలెట్ మండలంగా అల్లూరు

- ఐదేళ్లు నిండిన బాలలు కచ్చితంగా బడిలో ఉండాలి
- ఎన్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ జూబిలీ పద్మనాభన్


విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారుల బృందం

అల్లూరు, జూన్ 20 : ఐదేళ్లు నిండిన బాల లంతా బడిలో ఉండేలా కార్యాచరణ చేపట్టామని ఎన్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ జూబిలీ పద్మనా భన్ అన్నారు. గురువారం అల్లూరులోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలను సమగ్ర శిక్ష నెల్లూరు అకడ మిక్ మానిటరింగ్ అధికారి జీ.సుధీర్ బాబు, ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) పల్లిపాడు ఉపన్యాసకులు కే విజయచంద్రలతో కలసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలెట్ మండలంగా అల్లూరును ఎంపిక చేసుకొని, ఇక్కడి పాఠశాలల్లోని విద్యార్థు లను కలిశామన్నారు. వారిలోని సృజనాత్మకతను వెలికి తీసి, విద్యాప్రవేశ్ కార్యక్రమాన్ని రూపొం దిస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రారంభ మూల్యాంకనం జరుగుతున్న క్రమంలో పాఠశాలలను పరిశీ లించామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు ఎన్.రవీంద్రనాథ్, ఎస్.సునీత, హెచ్‌ఎం యస్.కె.సమీనా, ఉపాధ్యాయుడు పీవీ రమణ, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు పీ నాగరాజారావు, సీహెచ్.గోపాల్, ఓవీ.రాజు తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట రైల్వే ప్రగతిపై ఉద్యమం



రైలు మద్దతు యాప్ ద్వారా సమస్యలు తెలియచేస్తున్న నూరుద్దీన్

బిట్రగుంట, జూన్ 20: బిట్రగుం ట రైల్వే ప్రగతిపై దశల వారీగా ఉద్య మాన్ని తీవ్రతరం చేస్తామని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యుడు షేక్.నూరు ద్దీన్ అన్నారు. బోగోలు బజారు కూడల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం రైలు మద్దతు యాప్ ద్వారా అధికారులకు సమస్యలను తెలియచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు మండలాల వారికి ఉపయోగపడే రిజర్వేషన్ కౌంటర్ తొలగించడంపై స్థానికుల ద్వారా రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. కోవిడ్ సమయంలో స్టాపింగ్ ఎత్తివేసిన ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బీ రవి చంద్ర, ఆరోగ్యరాజ్, మునుస్వామివేణు, రాజారత్నం, భాగ్యరాజ్, జహీర్ తదితరులు పాల్గొన్నారు. రైల్వే ఉద్యమానికి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, జైభీం అంబేడ్కర్ సేవాదళ్ సభ్యులు, వ్యాపారులు సంఘీభావం తెలిపారు.

గొట్టిగుండాలలో రాష్ట్రస్థాయి ఎడ్లపందేలు


బండ లాగుతున్న ఎడ్లు

కొండాపురం, జూన్20: మండలంలోని గొట్టిగుండా లలో అంకాళమ్మ తిరునాళ్ల సందర్భంగా గురువారం అమ్మవారికి భక్తులు పొం గళ్లుపెట్టి మొక్కులు తీర్చుకు న్నారు. ఈసందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఎడ్లకు బండ లాగుడు పందేలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు ఐదు జతల ఎడ్లు వచ్చాయి. నిర్ణీత సమయంలో బండను ఎక్కువ దూరంలాగిన కడపజిల్లా వల్లూరు మండలం బలుగారిపల్లె గ్రామానికి చెందిన ఇందిరెడ్డి రమణారెడ్డి ఎడ్లకు రూ. 50 వేలు, రెండవ స్థానంలో నిలిచిన కడప జిల్లా పొద్దుటూరు మండలం, వైఎమ్ఆర్ కాలనీకి చెందిన డీ.గురివిరెడ్డి ఎడ్లకు రూ.40 వేలు, మూడవ స్థానంలో నిలిచిన ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం బల్లికురవ గ్రామానికి చెందిన పావులూరి వీరాస్వామి చౌదరి ఎడ్లకు రూ.30 వేల నగదును నిర్వాహ కులు అందచేశారు. ఎడ్ల పందేలను చూసేందుకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

23న జిల్లా హాకీ జట్టు ఎంపిక

నెల్లూరు (విద్య), జూన్ 20 : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 23వ తేదీన జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు హాకీ ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా కార్యదర్శి పీ జగన్‌మోహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2005 జనవరి 1వ తేదీలోపు జన్మించిన వా రు అర్హులని, టెన్త్ మార్కుల లిస్ట్, ఆధార్, ఫొటోల తో హాజరు కావా లన్నారు. ఎంపికైన క్రీడాకారు లు ధర్మవరంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతి నిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు సాయంత్రం 3 గంటలకు ఎంపికలకు హాజరు కావాలని కోరారు.

దేవరపాళెంలో కబ్జా భూమికి విముక్తి

- ఆరు నెలలుగా వైసీపీ నేత 'హంస' ఆక్రమణ
- ప్రభుత్వం మారడంతో రంగంలోకి అధికారులు
- 79 మంది బాధితులకు 7 ఎకరాల అప్పగింత


వివాదాస్పద భూమి వద్ద బాధితులు, అధికారులు

నెల్లూరు రూరల్, జూన్ 20 : రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత వైసీపీ నాయకుల ఆక్రమణలు, ఆగడాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తు న్నాయి. ఇలాంటి ఘటనే నెల్లూరు రూర ల్ మండలం దేవరపాళెంలో వెలుగు చూసింది. అక్కడ సర్వే నెం. 238, 239-1, 389లలో 15 ఎకరాల విస్తీర్ణంలో కొన్నాళ్ల క్రితం రియల్ ఎస్టేట్ వెంచరు ఏర్పాటు చేశారు. అందులో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ప్లాట్లు కొనుగోలు చేశా రు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ, గ్రామానికి చెందిన వైసీపీ నేత వేమిరెడ్డి హంసకుమార్‌రెడ్డి, ఇతరులు కలిసి ఆరు నెలల క్రితం ఆ వెంచరులోని 15 ఎక రాల్లో సుమారు 7 ఎకరాల వరకు 79 మందికి చెందిన ప్లాట్లను ఆక్రమించార ని బాధితులు వాపోయారు. ఆక్రమిత స్థలాల చుట్టూ ఇనుప కంచె కూడా వేశారు. అప్పట్లో బాధితులు మీడియా ముఖంగా లబోదిబోమంటూ తమకు జరిగిన అన్యాయాన్ని వెల్లడించారు, అధికారులనూ ఆశ్రయించారు. వైసీపీ అధికారంలో ఉండటంతో ఎవరు ఏమీ చేయలేక పోయారు. ఇటీవల ప్రభుత్వం మారడంతో బాధితులంతా మరోసారి అధికారు లకు మొరపెట్టుకున్నారు. దీంతో గురువారం రెవెన్యూ, పోలీసు యం త్రాంగం రంగంలోకి దిగి సదరు భూమిని సర్వే చేశారు. ఆక్రమణలో ఉన్న ప్లాట్లు బాధి తులవేనని తేలడంతో తిరిగి వారికి అప్పగించారు. రెవెన్యూ రికా ర్డుల ప్రకారం ప్లాట్లు ఎవరి పేరున ఉంటే వారందరికీ ఆయా ప్లాట్లను అందచే శామని తహసీల్దారు సుబ్బారెడ్డి తెలిపారు. దీంతో బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

'ఉద్యాన' రాయితీ

అందని ద్రాక్షేనా!?

- రూ.2 కోట్ల వరకు బకాయిలు
- అధికారుల చుట్టూ రైతుల ప్రదక్షిణ
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

నెల్లూరు (వ్యవసాయం), జూన్ 20 : ఉద్యాన పంటల వైపు అడుగులు వేస్తున్న రైతులకు రాయితీ నిధులు అందని ద్రాక్షలా మారాయి. ప్రకటనల్లో కనిపిస్తున్న నిధుల కేటా యింపులు రైతుల ఖాతాల్లో మాత్రం జమ కావడం లేదు. జిల్లాలో దాదాపు 30వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఈ పంటల విస్తీర్ణం పెంచేందుకు రాయితీలు ప్రకటిస్తూ ప్రభు త్వం సాగుదారులను ప్రోత్సహిస్తోంది. ఇందుకు గాను 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు రూ.206 లక్షలు కేటా యించింది. మామిడి, నిమ్మ, జామ, బొప్పాయి, అరటి వంటి పండ్ల తోటలతో పాటు కాయ గూరలు, పూలమొక్కల పెంపకం జరుగుతోంది. ఉద్యాన శాఖ ద్వారా సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాయి. కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చొప్పున రైతులకు రాయితీ సొమ్ము అందించాల్సి ఉంది. అయితే కేంద్రం నుంచి నిధులు వస్తు న్నా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా విడుదల చేసి చెల్లించడంలో జాప్యం జరుగుతోంది. శీతల గిడ్డంగులు, నీటికుంటలు, పందిరి సాగు, హైబ్రీడ్ పంటలు, రైతులకు శిక్షణ, ఆధునిక పరిక రాలు తదితర వాటికి రాయితీ నిధులు రూ.206 లక్షలు రావాల్సి ఉంది. గతంలో పథకాన్ని బట్టి 40 నుంచి 50 శాతం రాయితీ ఇస్తుండగా మిగిలిన సొమ్ము రైతు వాటాగా సమకూర్చు కుంటే సరిపోయేది. అయితే, వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులే ముందుగా 100శాతం సొమ్ము చెల్లించి ఏర్పాటు చేసుకున్నారు. నెలలు గడుస్తున్నా రాయితీ సొమ్ము విడుదల కాకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం అవుతోంది.



రాయితీల్లో కోతలు

ఐదేళ్ల కిందట పాత నిమ్మ, మామిడి తోటల పునరుద్ధర ణకు ప్రత్యేక రాయితీలు అందేవి. కొమ్మల కత్తిరింపుల కోసం చిన్నపాటి కత్తెరలు, ఇతర సామగ్రితో పాటు ఎరు వులు, మందులు రాయితీపై ప్రభుత్వం ఇచ్చేది. అంతేగాక 20ఏళ్లలోపు తోటలకు పునరుద్ధ రణ పథకం కింద హెక్టారుకు దాదాపు రూ.20వేల వరకు రాయితీపై వివిధ రకాల పరికరాలు, ఎరువులు, మందులు అందేవి. ఈ పథకాలన్నిటికీ వైసీపీ తిలోదకాలు ఇచ్చింది. అంతేగాక ఉద్యాన యాంత్రీకరణ పథకం కింద రైతులకు నచ్చిన కంపెనీకి చెందిన పరికరాలు 50శాతం సబ్సిడీతో రైతులకు అందేవి. కేవలం రైతు వాటా మాత్రమే చెల్లిస్తే సరిపోయేది. కానీ వైసీపీ ప్రభుత్వంలో నూరుశాతం నగదు చెల్లిస్తేనే పరికరాలు అందే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో తమకు ఉపయోగపడే పథకాలు, రాయితీలు తిరిగి అందుతా యని బకాయిలు కూడా విడుదల అవుతాయనే ఆశతో ఉద్యాన రైతులు ఉన్నారు.

దేవదాయశాఖ భూముల సర్వే


ఆదురుపల్లి ఆలయ భూములను సర్వే చేస్తున్న దేవదాయశాఖ, రెవెన్యూశాఖ అధికారులు

చేజర్ల, జూన్ 20: ఆదురుపల్లిలోని దేవాదాయశాఖ భూములను గురువారం దేవాదాయశాఖ, రెవెన్యూశాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. పూర్తి వివరాల మేరకు.. చిత్తలూరుకు చెందిన వీరభద్ర, చెన్నకేశవ స్వామి ఆలయాలకు చెందిన భూమి 25ఎకరాలకు పైగా ఉంది. అయితే ఆదరుపల్లి ప్రధానకూడలి కావ డంతో రోజు రోజుకు ఆక్రమణలు పెరిగి పోయాయి. ఈ నేపథ్యంలో గతంలో ఉన్న పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ తరుణంలో ఆత్మకూరు శాసనసభ్యులు గా ఎన్నికైన ఆనం రామనారాయణరెడ్డికి రాష్ట్ర దేవాదాయశా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఈనేపథ్యంలో సోమశిల గ్రూపు దేవస్థానం ఈఓ కుడారి ప్రసాద్ ఆధ్వర్యంలో వీఆర్వో హరీష్, సర్వే యర్లు ఈ సర్వేలో పాల్గొన్నారు. శుక్రవారం కూడా సర్వే జరుగుతుందని అనంతరం పూర్తి నివేదికను ఉ న్నతాధికారులకు అందజేయనున్నట్లు వారు చెప్పారు.

సోమశిల జలాశయాన్ని సందర్శించిన ఎస్ఈ


పైలాన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటరమణారెడ్డి

అనంతసాగరం, జూన్ 20: సోమశిల జలాశ యాన్ని గురువారం ఎస్ఈ వెంకటరమణారెడ్డి సంద ర్శించారు. డ్యాంలోని ఎగువ నుంచి వచ్చే ప్రవాహం, నీటి నిల్వ, దిగువ నీటి సరఫరా వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా జలాశయం ప్రాంగణంలోని హై లెవల్, ఎన్‌టీఆర్ పైలాన్ ప్రాంతాలను పరిశీలిం చారు. త్వరలో మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, దేవదాయశాఖమాత్యులు ఆనం రామనారాయణరెడ్డి సోమశిల పర్యటన ఉందని ఈ లోపు అడ్డంకులు తొలగించి చేయాల్సిన పనులు పూర్తి చేయాలని ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశారు. కార్య క్రమంలో ఈఈ దశరథ రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వేగు పెంచలయ్య, జేఈలు ఉన్నారు.

వ్యాన్ ఢీకొని మహిళ మృతి


మృతి చెందిన పాకం లక్ష్మమ్మ

వెంకటాచలం, జూన్ 20 : వ్యాన్ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన మండలం లోని గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద గురువారం రాత్రి జరిగిం ది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గొలగ మూడి క్రాస్ రోడ్డు వద్ద పాకం బాలకృష్ణయ్య, లక్ష్మమ్మ దంపతు లిద్దరూ నివాసం ఉంటూ పక్కనే కూల్‌డ్రింక్ షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే బాలకృష్ణయ్య సతీమణి లక్ష్మమ్మ (63) జాతీయ రహదారి దాటు తుండగా గూడూరు నుండి కావలి వైపు వేగంగా వెళ్తున్న టాటా మ్యాజిక్ ట్రక్కు వ్యాన్ ఢీకొంది. ఈప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. అంబు లెన్స్‌లో చికిత్స నిమిత్తం నెల్లూ రు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలి పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తు న్నారు.

ఎయిడ్స్, క్షయకు తక్షణ వైద్యం అందించాలి

- బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరి
- వైద్యశాఖ జేడీ డాక్టర్ రమేష్


అధికారులకు సూచనలిస్తున్న జేడీ డాక్టర్ రమేష్

నెల్లూరు (వైద్యం), జూన్ 20 : ఎయిడ్స్, క్షయ వ్యాధుల నివార ణకు తక్షణ వైద్య చికిత్సలు అందించాలని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ ఆదేశించారు. గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉన్న ఎయిడ్స్ నివారణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ అందిస్తున్న వైద్య చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. బాధితు లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్యాధికారుల సమావేశంలో డాక్టర్ రమేష్ మాట్లాడారు. 2029 నాటికి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం తగిన వైద్య చికిత్సలు అందిస్తోందని, వాటిని రోగులు సద్వినియోగం చేసుకు నేలా చూడాలని అధికారులను ఆదేశించారు. 60 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యా ధులు, ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లు ఉన్న వారిని గుర్తిం చి వారికి ఈ వ్యాక్సిన్ వేయాలని, తద్వారా క్షయ వ్యాధి రాకుండా చూడాలన్నారు. క్షయ నుంచి కోలుకున్న బాధితులతోపాటు వ్యాధిగ్ర స్తుల కుటుంబాలకు కూడా వ్యాక్సిన్ వేయాలన్నారు. హెచ్ఐవీ సోకిన వారికి క్షయవ్యాధి వచ్చే అవకాశం ఉందని, అలాంటి వారి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సాక్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు

సంగం, జూన్ 20: వెంగారెడ్డిపాళెం షిరిడీ సాయిబాబా ఆలయ ఐదో వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. అనంతర వేద పండితుల మంత్రశ్చరణల నడుమ క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పూలతో విశేషాలంకరణ చేసి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ శిఖర కలశానికి జలాలతో అభిషేకాలు చేశారు. సర్పంచ్, ఆలయ నిర్మాణ దాత ఆనం ప్రసాద్‌రెడ్డి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

మాతాపరమేశ్వరికి పులివాహన సేవ

స్థానిక తూర్పు దళితవాడలో వెలసిన మాతా పరమేశ్వరి గురువారం తెల్లవారుజామున పులి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన అడవి పేరంటాలమ్మ ఉత్సవాలు



ఉదయగిరి: పోటీల్లో బండలాగుతున్న ఎడ్లు

ఉదయగిరి, జూన్ 20: గన్నేపల్లి పంచాయతీలో వెలసిన అడవిపేరంటాలమ్మ ఉత్సవాలు గురువారం బండ్ల పొంగళ్ల కార్యక్రమంతో ముగిశాయి. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలను భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద అమ్మవారి చీరలను వేలం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న దాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద పండరీ భజన, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఎద్దుల బండలాగుడు పోటీలు

ఆలయం వద్ద ఎద్దులు బండలాగుడు పోటీలు నిర్వహించగా మూడు జతల ఎద్దులు పాల్గొన్నాయి. కడప జిల్లా మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మూల సూరారెడ్డి ఎద్దులు ప్రథమస్థానం బద్వేల్ మండలం కుమ్మరికొట్టాలు గ్రామానికి చెందిన వినుకొండ రఫీకు చెందిన ఎద్దులు ద్వితీయస్థానంలో నిలిచాయి. కడప జిల్లా చెన్నూరు మండలం గోగులపల్లికి చెందిన కోనపురెడ్డి సతీష్‌రెడ్డి ఎద్దులు తృతీయసానంలో నిలిచాయి.

శ్రీనివాసుడి కల్యాణం

ఉదయగిరి రూరల్, జూన్ 20: స్థానిక బీసీ కాలనీ సమీపంలోని సంతానలక్ష్మి ఉత్సవాల్లో భాగంగా గురువారం భక్తులు భూ దేవి, శ్రీదేవి సమేత శ్రీనివాసుని కల్యాణంను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి విగ్రహాలకు విశేష పూజలు, అభిషేకాలు చేసి అలంకరణ చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



షిరిడీ సాయిబాబాకు అభిషేకం చేస్తున్న అర్చకులు



పులివాహనంపై ఊరేగుతున్న మాతాపరమేశ్వరి



ఉదయగిరి: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మంత్రిని కలిసిన చెంచలబాబు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చెంచలబాబు

ఉదయగిరి రూరల్, జూన్ 20: రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారథిని విజయవాడలోని ఆయన నివాసంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, జెడ్పీ మాజీ ఛైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పేదలందరికీ పక్కాగృహాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయనకు విజ్ఞప్తి చేసినట్లు చెంచలబాబు తెలిపారు.

బీసీజీ టీకాపై అవగాహన

ఉదయగిరి రూరల్, జూన్ 20: స్థానిక బీసీ కాలనీలోని గండిపాళెం ప్రాథమిక వైద్యశాల ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య బీసీజీ టీకాపై అవగాహన కల్పించారు. గురువారం కాలనీలో జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఏడాదిలోపు పిల్లలకు ఈ టీకా వేస్తే క్షయ వ్యాధి నివారించబడుతుందన్నారు. అలాగే పెద్దలకు కూడా బీసీజీ టీకా ఇవ్వడం వల్ల ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. టీకా వేయించు కోవడం వల్ల ఎలాంటి దుష్పరిణామాలు ఉండవన్నారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్లు భోగ్యం వెంకటేశ్వర్లు, మురళి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయండి

ఉదయగిరి రూరల్, జూన్ 20: పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. గురువారం కుర్రపల్లి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుభాషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

సంగం, జూన్ 20: అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతూ 5ఏళ్లు దాటిని చిన్నారులను ప్రాథమిక పాఠశాలకు ప్రమోట్ చేసే కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ కొత్తగా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా గురువారం జండాదిబ్బలో అంగన్‌వాడీ కేంద్రంలో 5ఏళ్లు పైబడిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పేరుతో తలకు రివార్డులు తొడిగి సత్కరించారు. కార్యక్రమంలో ఐసీడీయస్ సీడీపీవో సునీలత, సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మిలావణ్య, లీలమ్మ, చెంచమ్మ చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డిప్లమో కోర్సులో ప్రవేశానికి గడువు పెంపు

అనంతసాగరం, జూన్ 20: పదో తరగతి, తత్సమాన పరీక్షలో ఉతీర్ణులైన అభ్యర్థులు 2024-25 విద్యా సంవత్సరంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుంటూరు డిప్లొమో కోర్సులో ప్రవేశానికి ఈనెల 30వరకు గడువు పెంచినట్లు సోమశిల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కే.పల్లంరాజు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20వరకు ఉన్న గడువును మరో పదిరోజులు పెంచినట్లు గుర్తు చేశారు. కోర్సులో చేరు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నీటి వృథాను అరికడదాం..!



అనంతసాగరం, జూన్ 20: సేవ్ వాటర్ పేరుతో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ర్యాలీ చేపట్టారు. నీటిని వృథా చేయరాదని ప్రజలకు సూచనలిచ్చారు. తొలుత సేవ్ వాటర్ కార్యక్రమంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి చెన్నకేశవుడి ఉత్సవాలు

వరికుంటపాడు, జూన్ 20: గువ్వాడిలో శుక్రవారం నుంచి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గురువారం నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. తొలిరోజు సీతారామ కల్యాణం, గ్రామోత్సవం, 22న వసంతోత్సవం, పారువేటతో పాటు లక్ష్మిచెన్నకేశవ స్వామి కొలువుల ఉత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అదేరోజు రాత్రి నిండుపూజ, గ్రామోత్సవం, 23న పోతురాజుస్వామి భోణం, చాపకుల్లా బంతి, దీవెన బండారు నిర్వహిస్తామని చెప్పారు.

ఆర్‌అండ్‌బీ అతిథిగృహం మరమ్మతులు చేపట్టండి: కలెక్టర్



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

ఆత్మకూరు, జూన్ 20: పట్టణంలోని రహదారులు, భవనాలశాఖకు సంబంధించిన ఆర్‌అండ్‌బీ అతి థిగృహానికి మరమ్మతులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకరావాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులకు ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రహరీ, గదులకు సీలింగ్, పెయింటింగ్ పనులను సత్వరమే చేపట్టాలన్నారు. భవనం ఆవరణలోని చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అంత కుముందు ఆయన ఆర్డీవో కార్యాలయాన్ని పరిశీలించారు. ఆర్డీవో చాంబర్, సిబ్బంది విధులు నిర్వహిస్తున్న గదులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.మధులత, ఆర్‌అండ్‌బీ ఈఈ మురళీకృష్ణ, డీఈ మదన్‌కుమార్, ఏఈ అనిల్ పాల్గొన్నారు.

'నేడు బడికి పోతా' కార్యక్రమంపై అవగాహన

సంగం, జూన్ 20: స్థానిక మండల కార్యాలయంలో గురువారం మండలస్థాయి కమిటీ సభ్యులకు నేడు బడికి పోతా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భం గా ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడారు. పంచాయతీల్లో గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకుని వచ్చే నెల 12వ తేదీ లోపు బడిబయట పిల్లలను.. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అందులో భాగంగా ఎన్యూమరేటర్లుగా నియమించబడిన గ్రామ వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా బడిబయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేలా ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు జానికీరామ్, మల్లయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఐసీడీఎస్ సిబ్బంది, ఏఎస్‌ఓ పాల్గొన్నారు.

మర్రిపాడు: మండల కేంద్రంలోని హైస్కూల్ విద్యార్థులతో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు.. బడిలో .. పిల్లలు బడికి -పెద్దలు పనికి అంటూ నినాదాలు చేస్తూ హైస్కూల్ నుండి మర్రిపాడు బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్‌రాజు, తహశీల్దార్ సీతారత్నం, ఎఈవో ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ఏఎస్ పేట, జూన్ 20: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య నందిస్తున్నట్లు ఉపాధ్యాయులు అంజాద్, మల్లికార్జునరావు తెలిపారు. గురువారం వారు ఏఎస్ పేట, చిన్నహబీపురం గ్రామాల్లో పర్యటించి విద్యార్థుల ఇంటికి వెళ్లి ప్రభుత్వ బడుల గురించి అవగాహన కల్పించారు. పథకాల గురించి తల్లిదండ్రులకు వివరించారు.

పెరమనలో డయేరియాపై అవగాహన

సంగం, జూన్ 20: పెరమనలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో గురువారం డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉన్న తొట్టెలు, డబ్బాలు, ఫ్లాస్టిక్ కవర్లు, టైర్లలో డయేరియాను వ్యాపింపజేసే దోమలు ఎలా వృద్ధి చెంది ఉంటాయే క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. నీటి నిల్వ ఉన్నవాటిని తొలగించారు. వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్య పరిరక్షణకు కృషి

వరికుంటపాడు, జూన్ 20: ప్రాథమిక విద్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీ.మాల్యాద్రి అన్నారు. గురువారం మండలశాఖ ఆధ్వర్యంలో విరువూరు, నార్త్‌కొండాయపాళెం, పెద్దిరెడ్డిపల్లి, తోటల చెరువు పల్లి, కొత్తపల్లి, ఇస్కపల్లి, కాంచెరువు, గువ్వాడి, తూర్పుబోయమడగలలోని పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదును చేపట్టారు. ఉపాధ్యాయ సమస్యలపై తొలినుంచి పోరాటాలు సాధించి ఎన్నో విజయాలు సాధించిన ఘనత తమ శాఖకే దక్కుతుందన్నారు. అనంతరం సభ్యత్వం పొందిన ఉపాధ్యాయులకు రశీదులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలకృష్ణ, జిలానీబాష, బాధ్యులు నాగేశ్వరరావు ఉన్నారు.

అపస్ సభ్యత్వాలపై ప్రచారం

సంగం: అన్నారెడ్డిపాళెం, సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అపస్ ఉపా ధ్యాయ సంఘం నాయకులు సభ్యత్వంపై గురువారం ప్రచారం నిర్వహించారు. పలువు రు ఉపాధ్యాయులతో సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దశయ్య, మండలాధ్యక్షుడు శశిధర్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కమిటీ సభ్యులు మల్లికార్జునరావు, కేవీ ప్రసాద్, వెంకురెడ్డి, శివకుమార్, రమణయ్య పాల్గొన్నారు.

వైద్యశాలను తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్ బృందం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 20: నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం టాస్క్‌ఫోర్స్ జిల్లా బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా వైద్యశాలలోని మందుల గది, వార్డులను పరిశీలించి రికార్డులు తనిఖీ చేసి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వారికి సలహాలు అందజేశారు. అలాగే నర్రవాడలో జరుగుతున్న వైద్యసేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించి గర్భవతులు, బాలింతలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యులు మనోజ్ఞ, హరీష్, టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు రమేష్, షైనీ, ఆరోగ్య పర్యవేక్షకులు రియాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 20: నర్రవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి లో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం నుంచి ఆదివారం వరకు వ్యవసాయ విద్యుత్ సరఫ రా వేళల్లో మార్పులు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటసుబ్బయ్య గురువారం ఓ ప్రకటన లో పేర్కొన్నారు. ఉదయం 4నుంచి 8గంటల వరకు, సాయంత్రం 6నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఈ విషయాన్ని రైతులు గమనించా లని కోరారు.

మద్యం డోర్ డెలివరీ !

● క్వార్టర్‌కు రూ.50 నుంచి రూ.100 వసూలు ● విచ్చలవిడిగా అమ్మకాలు

ఉదయగిరి, జూన్ 20: మందుబాబుల సేవకు బెల్టుషాపుల నిర్వాహకులు సిద్ధంగా ఉన్నారు. దూరాన్ని బట్టి రూ.50 నుంచి రూ.100లు అదనంగా చెల్లిస్తే చాలు ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడి కావాలంటే అక్కడికి ఏ సమయంలోనైనా మద్యం అందు తుంది. మద్యం దుకాణాల్లో నిబంధనల మేరకు విక్రయాలు జరగాలి. కానీ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో మామూళ్లకు అలవాటుపడిన సిబ్బంది ఇష్టారీతిన మద్యం అమ్మకాలు చేస్తున్నారు. గ్రామాల్లో ఒకర్ని చూసి మరొకరు విచ్చలవిడిగా మద్యం అమ్మకాలకు పోటీ పడుతున్నారు. ఉదయగిరి, సీతారామపురం, పెద్దిరెడ్డిపల్లి, దుత్తలూరు, వింజమూరు, కృష్ణాపురం, వరికుంటపాడు మద్యం దుకాణాల వద్ద మద్యంప్రియుల కన్నా బెల్టుషాపు లకు మద్యం తీసుకెళ్లే వారే అధికంగా ఉంటున్నారు. రోజుకు రూ1000 నుంచి రూ.1500లు సంపాదిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అన్నా... ఆ పోస్టులు మాకే ఇవ్వాలి !

● గ్రామాల్లో ఆశావహుల లాబీయింగ్

వలేటివారిపాలెం, జూన్ 20 : కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఉపాధి పథకం ఫీల్డ్‌అసిస్టెంట్, డీలర్ల పోస్టులకు పోటీ పెరిగింది. మండలంలో 28 డీలర్ పోస్టులు, 21 ఫీల్డ్‌అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయి. అయితే అన్ని గ్రామాల్లో తమకంటే తమకే పోస్టులు ఇప్పించాలని టీడీపీ కార్యకర్తలు పోటీపోటీగా లాబీయంగ్ చేస్తున్నారు. ఎవరికి ఇవ్వాలో తెలియక ద్వితీయశ్రేణి నాయకులు తలలు పట్టుకుంటున్నారు. గ్రామాల్లో ఒక్కో పోస్టుకు 10 నుంచి 15 మంది పోటీ పడుతున్నారు. రేషన్ డీలర్ల నియామకానికి ఇదే స్థాయిలో పోటీ నెలకొంది. తమ ప్రభుత్వం వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తానని చంద్రబాబు చెప్పగా దీంతో ఆ పోస్టులకు కూడా డిమాండ్ ఏర్పడింది. ఈ పోస్టులకు పెద్ద మొత్తంలో నగదు కూడా ఇచ్చేందుకు ఆశావహులు పోటీ పడుతున్నారు.కాగా ఎన్నికలలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే తగిన గుర్తింపు ఇచ్చి న్యాయం చేసేలా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముందుకు వెళ్తునట్లు తెలిసింది. గ్రామ నేతల సమష్టి నిర్ణయం మేరకే పోస్టులు భర్తీ చేస్తానని ఆయన అన్నట్లు సమాచారం.

'నేను బడికిపోతా'నంటూ ఊరూరా ర్యాలీ

కావలి రూరల్, జూన్20: కావలి మండలం మన్నంగిదిన్నె ఎంపీపీ పాఠశాల విద్యార్థులు గురువారం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం ఎ. వెంకటరత్నం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎం. రాజ్యలక్ష్మి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : ఐదేళ్లు నిండిన ప్రతి చిన్నారి బడిలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జ్యోతి అన్నారు.స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నేను బడికిపోతా కార్యక్రమంపై గురువారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు గ్రామాల్లో పర్యటించి బడికి పంపకుండా ఉండే పిల్లలను గుర్తించి వారిని బడికి పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు దుర్గేశ్వరరావు, ఎంఈవో -1 రవీంద్రనాథ్, ఈవోపీఆర్డీ పెంచల రవీంద తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాధరావుపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం. రవీంద్రనాథ్ ఠాగూరు ఆధ్వర్యంలో గురువారం నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విశ్వనాధరావుపేట, రామస్వామిపాలెం ప్రాంతాలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ అనిల్‌కుమార్, సచివాలయ ఏఈ సునీల్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.



కావలి : నేను బడికి పోతానంటూ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



అల్లూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జ్యోతి



బిట్రగుంట : ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్‌ఎం రవీంద్రనాథ్ ఠాగూర్, విద్యార్థులు

పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి : ఇంటూరి

కందుకూరు, జూన్ 20: పొగాకు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని రెండో పొగాకు వేలం కేంద్రంలో గురువారం ఆయన వేలంను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి కష్టనష్టాలనుతెలుసుకున్నారు. అనంతరం ఆర్‌ఎం లక్ష్మణరావు, వేలం కేంద్రం అధికారి రాజగోపాలరెడ్డి సమక్షంలో వ్యాపార ప్రతినిధులతో మాట్లాడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు సానుకూలంగా స్పందించాలన్నారు. పలువురు రైతులు తమ సమస్యలను నాగేశ్వరరావు దృష్టికి తీసుకురాగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామన్నారు. ఈ సందర్భంగా బోర్డు అధికారులు, రైతు ప్రతినిధులు, రైతులు నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు.

మంత్రులకు ఇంటూరి శుభాకాంక్షలు

పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా గురువారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సచివాలయంలో పలువురు మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమశాఖామంత్రి ఎస్. సవిత, రవాణాశాఖామంత్రి ఎం. రాంప్రసాద్‌రెడ్డిలను వారివారి చాంబర్లలో కలిసి ఘనంగా సత్కరించారు.

ఇంటూరికి అభినందనల వెల్లువ

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు అభినందనలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. పలు శాఖల అధికారులు, వివిధ ప్రభుత్వశాఖల ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు గురువారం ఆయనను కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యాశాఖలో కందుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పనిచేస్తున్న సీఆర్‌ఎంటీ(సీఆర్‌పీ)లు, ఫారెస్టు అధికారులు, చాకిచర్ల పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు ఎమ్మెల్యే నాగేశ్వరరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కందుకూరు-2లో పొగాకు వేలంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు. తదితరులు

యోగా శిక్షణ

కావలి, జూన్20: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. పాఠశాల ఎన్‌సీసీ అధికారి షేక్ మస్తాన్‌వలీ ఆధ్వర్యంలో యోగా గురువు గోపాల్ విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. పాఠశాల హెచ్‌ఎం సుబ్బారావు తదితరులు మాట్లాడారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

కందుకూరు, జూన్ 20: లివర్‌వ్యాధితో బాధపడుతున్న పట్టణంలోని పోతురాజుమిట్టకు చెందిన చిన్నారి షేక్ ఆర్మన్ వైద్యఖర్చుల కోసం మధిర బ్రహ్మరూప్ మిత్రబృందం గురువారం రూ. 60వేలు ఆర్థికసహాయాన్ని అందించారు. బ్రహ్మరూప్, నూర్ మొహమ్మద్, సయ్యద్ షాకీర్, శానంపూడి మహేష్, ఇమ్రాన్ వారి మిత్రులు కలిసి ఈ మొత్తాన్ని చిన్నారి తల్లిదండ్రులకు అందచేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, జూన్ 20 : మండలంలోని మొగిలిచెర్ల సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు బుధవారం అర్ధరాత్రి ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బంది మన్నేరు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గ్రామంలో పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మత్తులో రోడ్డు ప్రమాదాలు

● ప్రాణాలు కోల్పోతున్న అమాయకులు

లింగసముద్రం, జూన్ 20 : ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా మద్యం లభించడం, మద్యం సేవించి వాహనాలు నడుపుతుండడంతో రోడ్డు ప్రమాదాలు జరిగి అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని పలువురు వాపోతున్నారు. రోడ్డుపక్కన ఉండే బడ్డీకొట్లు, అంగళ్లు, హోటళ్లలో విచ్చలవిడిగా మద్యం లభ్యమవుతోంది. దీంతో కొంతమంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారు. అందువల్ల అమాయకులైన కొందరు ప్రాణాలు కోల్పోతుండడమే గాక, మరికొందరు తీవ్ర గాయాలపాలవుతున్నారు. ఇటీవల రాత్రి పూటుగా మద్యం తాగిన ఓ వ్యక్తి మైటారుసైకిల్‌పై అతి వేగంగా వెళ్తూ మొగిలిచెర్లకు చెందిన ఇద్దరు యువకులు వస్తున్న మోటారు సైకిల్ ను ఢీకొట్టాడు. దీంతో ఆ ఇద్దరిలో ఓ యువకుడు అక్కడే చనిపోగా, మరో యువకుడు తీవ్రగాయాల పాలై చికిత్స పొందుతున్నాడు. గతంలో మొగిలిచెర్ల నుంచి స్కూటీపై వస్తున్న ఓ ఉద్యోగిని మద్యం తాగిన ఓ వ్యక్తి కారులో వేగంగా వెళ్తూ ఢీకొట్టాడు. అదృష్టవశాత్తు ఆమె గాయాలతో బయటపడింది.

తాగునీటి రక్షణపై అవగాహన అవసరం



సేవ్ వాటర్ అంటూ పలకలపై రాసుకుని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అల్లూరు, జూన్ 20 : తాగునీటి సంరక్షణపై మండలంలోని పాఠశాలల్లో గురువారం అవగాహన కల్పించారు. ఎంపీడీవో జ్యోతి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి బయలుదేరిన కావ్య



ఎమ్మెల్యే కావ్యకు శుభాకాంక్షలు తెలియచేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కావలి,జూన్20: ఎమ్మెల్యేగా గెలుపొందిన దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి శుక్రవారం అమరావతిలో ప్రమాణ స్వీకారం చేసేందుకు గురువారం సాయంత్రం కావలి ముసునూరులోని ఆయన నివాసం నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా 3వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు ద్రోణాదుల వెంకట్రావును గురువారం ఉదయం ఎమ్మెల్యే కావ్య ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. కాలుకు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటిలోనే విశ్రాంతి తీసుకుంటున్న వెంకట్రావు ఆరోగ్యపరిస్థితిని అడిగితెలుసుకున్నారు.

నిరుపయోగంగా పాలకేంద్రం భవనాలు !

లింగసముద్రం, జూన్ 20 : మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం పశు పోషకుల నుంచి పాలు సేకరించి అమూల్ సంస్థకు పాలు సరఫరా చేసేందుకు నిర్మించిన బల్క్ మిల్క్ సెంటర్‌లు (పాల కేంద్రాలు) నిరుపయోగంగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో మండలంలోని 13 సచివాలయాల పరిధిలో ఒక్కో పాల కేంద్రానికి సుమారు రూ.18 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో మాలకొండరాయునిపాలెం, పెంట్రాల గ్రామాల్లో పాల కేంద్రాల నిర్మాణం పూర్తి కావడంతో 5 నెలల క్రితం ప్రారంభించారు. లింగసముద్రంలోని సచివాలయం 1, 2 పరిధిలో రెండు పాల కేంద్రాల నిర్మాణ పనులు పూర్తి కాగా మిగిలిన 9 సచివాలయాల పరిధిలో పాల కేంద్రాల నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నాయి. పనులు పూర్తయిన కేంద్రాలను పశు సంవర్థక అధికారులకు అప్పగించారు. అయితే ప్రస్తుత అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఈ భవనాలను ప్రభుత్వం వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధికి నోచుకోని గ్రామీణ రహదారులు

● రైతులు, గ్రామీణుల అవస్థలు

కొండాపురం, జూన్ 20 : ఏళ్లు గడుస్తున్నా గ్రామీణ రహదారులు అభివృద్ధికి నోచుకోకపోవడంతో గ్రామస్థులు, రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలో 19 పంచాయతీలు, 52 మజరా గ్రామాలున్నాయి. ప్రతి గ్రామంలోనూ ఖరీఫ్, రబీ సీజన్‌లలో వివిధ రకాల పంటలను రైతులు పండిస్తున్నారు. రబీలో కంటే ఖరీఫ్‌లో అధికంగా పంటలను రైతులు సాగుచేస్తుంటారు. పొలాలకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా ఉండటం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని మేజరు పంచాయతీలైన కొమ్మి, సాయిపేట, తూర్పుఎర్రబల్లి గొట్టిగుండాల, గరిమెనపెంటలతోపాటు, గుడవల్లూరు, చింతలదీవి, భీమవరప్పాడు, ఉప్పలూరు, నేకునాంపేట, శెట్టిపాలెం తదితర పంచాయతీలలో పొలాలకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా తయారయ్యాయి. ఖరీఫ్‌లో వచ్చే వర్షాలకు చిత్తడిగా మారి నడచేందుకు కూడా వీలు లేకుండా ఉన్నాయి. గుంతలలో నీరు నిలబడి వర్షం తగ్గినప్పటికీ బురదమయంగా ఉంటున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం చెరువుల అభివృద్ధితోపాటు పొలాలకు వెళ్లే మార్గాలపై ఎలాంటి దృష్టి పెట్టలేదు. దీంతో రోడ్లన్నీ అడుగడుగునా గుంతలు పడిపోయాయి. కొద్దిపాటి వర్షం కురిసినా నీటితో నిండిపోతున్నాయి. పొలాలను దున్నేందుకు ఆదే రోడ్డుపై ట్రాక్టర్లు వెళ్తుండటంతో చిన్నపాటి గుంతలు పెద్దవిగా మారుతున్నాయి. గుంతలతోపాటు రోడ్డు కిరువైపులా కంపచెట్లు అల్లుకుపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అధికారులు స్పందించి గ్రామాలలోని రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



సాయిపేట- భీమవరప్పాడు గ్రామాల మధ్య పొలాలకు వెళ్లే రోడ్డు



చింతలదీవి గ్రామంలో పొలాలకు వెళ్లే రోడ్డు

మాలకొండలో నేడు హుండీల లెక్కింపు

వలేటివారిపాలెం : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మండపంలో శుక్రవారం 12 శనివారాలకు సంబంధించి 38 హుండీలను లెక్కించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

స్టేషనరీ పంపిణీ

కందుకూరు : మండలంలోని కొండముడుసుపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన రాత పుస్తకాలు, స్టేషనరీని గ్రామానికి చెందిన దాత పి. మహేష్ గురువారం అందించారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

సక్షం సంస్థాపన దినోత్సవం

కావలి : అఖిలభారత దివ్యాంగుల సంస్థ (సక్షం) వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం పట్టణంలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సక్షం డివిజన్ కన్వీనర్ ఎం. వేణుగోపాలరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం దివ్యాంగులకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు ఆర్టీసీ డీఎం రాపూరు శ్రీనివాసులు దంపతుల చేతుల మీదుగా బహుమతులు అందచేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధవరెడ్డి, తిరుపతిస్వామి, సీహెచ్ భాస్కర్, మరియమ్మ పాల్గొన్నారు.























కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

అన్నప్రసాద వితరణ భవనానికి విరాళం

కందుకూరు, జూన్ 20: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవనానికి గురువారం పలుకూరు గ్రామానికి చెందిన కొండూరి సురేష్‌బాబు, శిరీష దంపతులు రూ. 1,05,116లు విరాళంగా అంద జేశారు.ఆలయ కమిటీ సభ్యులు కేఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంక ట నరసింహం, నలబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామిలకు వా రు ఈ మొత్తాన్ని అందచేశారు. కార్యక్రమంలో సురేష్‌బాబు తల్లిదండ్రులు కొండూరి వెంకటసుబ్బారెడ్డి, తిరుమల దంపతులు, పూజారెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొని అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దాతలను సత్కరిస్తున్న అయ్యప్పసేవా సమితి సభ్యులు

పలు మండలాల్లో రెవెన్యూ దినోత్సవం

కావలి, జూన్20: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. కావలి తహసీల్దార్ కే. నగేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ శ్రీనివాసులును సత్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

గుడ్లూరు : రెవెన్యూ డే సందర్భంగా రైతులకు నిత్యం తలెత్తే సమస్యలపై అవగాహన కల్పించాలని, జిల్లా ఉన్నతాధికారులు తెలపగా, గుడ్లూరులో తూతూ మంత్రంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా వివిధ పనులపై కార్యాలయానికి వచ్చినవారిని కొద్దిసేపు కూర్చోబెట్టి కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. వెంకటరమణ, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు : ప్రతిఏటా జూన్ 20న రెవెన్యూ డేగా నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చంద్రారెడ్డి చెప్పారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో రెవెన్యూ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీవిరమణ చేసిన భీమవరం వీఆర్వో నరసరాజును శాలువాతో సత్కరించారు.

నేటి నుంచి రాములోరి తిరునాళ్ల

కావలి రూరల్, జూన్20: పట్టణంలోని కొనదిన్నె గిరిజన కాలనీలో గురువారం నుంచి 3 రోజులపాటు రాములవారి తిరునాళ్ల నిర్వహించనున్నట్లు ఆల య కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనం తరం కోలాటం నిర్వహించారు. శుక్రవారం రాత్రికి తిరుపతమ్మ కథ, శనివారం స్వామివారి కల్యాణం, ఆదివారం స్వామివారి ఊరేగింపు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు.

పాఠ్యపుస్తకాల ఇండెంట్లు ఇవ్వాలి

కందుకూరు, జూన్ 20: కందుకూరు డివిజన్ పరిధిలోని అన్ని ప్రైవేటు పాఠశాలల వారు పాఠ్యపుస్తకాల ఇండెంట్లు తప్పనిసరిగా ఇవ్వాలని ఉప విద్యాశాఖాధికారి (డీవైఈవో) ఎంవీవీ ప్రసాదరావు కోరారు. గురువారం ఆయన ఎంఈవో సుబ్బారెడ్డితో విద్యార్థుల సంఖ్యలో ఐదుశాతం తక్షణం ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా అడ్వాన్స్ చెల్లించాలన్నారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. తరగతుల వారీగా ఫీజుల పట్టికను కార్యాలయం ముందు ప్రదర్శించాలని స్పష్టంచేశారు. బడిఈడు గల పిల్లలు ఎక్కడైనా పనిచేస్తుంటే సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

రోడ్లు, కాలువలు లేక అవస్థలు

కావలి టౌన్, జూన్ 20 : కావలి పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా పట్టణం చుట్టుపక్కల ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటుచేసిన లేఔట్లలో కొత్తగా భవన నిర్మాణాలు జరిగి ప్రజలు నివసిస్తున్నప్పటికీ ఇప్పటికీ సీసీ రోడ్ల నిర్మాణం జరగలేదు. మట్టిరోడ్లతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు పడితే కాలు కిందపెట్టలేని పరిస్థితి. కొన్ని ప్రాంతాల్లో వీధిలోని నివాసితులందరూ కలిసి తలా కొంత నగదు పోగుచేసుకుని పగలగొట్టిన పాత కట్టడాల రబ్బీస్‌ను వీధుల్లో వేసుకుని నెట్టుకొస్తున్నారు. సీసీరోడ్లతో పాటు కాలువలు లేకపోవడంతో నివాసాల మధ్యనే మురుగు నీరు పారుతూ దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాలని వారు కోరుతున్నారు.



మాగుంట లేఅవుట్‌లో డస్ట్‌తో వేసుకున్న రోడ్లు, రోడ్డుపై పారుతున్న మురుగు





రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

విడవలూరు, జూన్ 20: ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలోని కామాక్షిదేవీ సమేత రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను గురువారం ఆమె విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దేవదాయ శాఖ, స్థానిక నాయకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామకృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి


తోటపల్లిగూడూరు: ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, చిన్నారులు

తోటపల్లిగూడూరు, జూన్ 20: మండలంలోని సౌత్ ఆములూరులో గురువారం మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సౌత్ ఆములూరు ప్రధానోపాధ్యాయుడు షేక్ అహ్మద్ బాషా ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తోటపల్లిగూడూరు మండల విద్యా శాఖాధికారి-2, డి జయరామ నాయుడు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. గ్రామంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించారు. విద్యాకిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ ఆర్ స్వాతి, పాఠశాల ఉపాధ్యాయులు కె వసంతలక్ష్మీ, కె హెప్సీ విద్యుల్లత, బి కృష్ణవేణి, పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు : స్థానిక ఈదూరు ఈశ్వరమ్మ జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులతో 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి ఆధ్వర్యంలో విద్యార్థులతో ఉన్నత పాఠశాల నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడికిరాని విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు మధుసూదన్, హేమసుందర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో ఎంపీ బాలశౌరి


కామాక్షితాయిని దర్శించుకుంటున్న ఎంపీ బాలశౌరి దంపతులు, కుటుంబ సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 20: మండలంలోని జొన్నవాడ ఆలయంలో మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారిని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ సిబ్బంది, అర్చకులు ఆలయ సాంప్రదాయాలతో వారిని స్వాగతించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. వారి వెంట మాజీ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు తదితరులు ఉన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ముత్తుకూరు, జూన్ 20 : మండలంలోని పాటూరి వారి కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు విద్యాసామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. నోటు పుస్తకాలు, పెన్నులు, అట్టలతో పాటు ప్లేట్లు, గ్లాసులను ఎంఈవో మధుసూదన్, హేమ సుందర్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను, వనరులను వినియోగించుకుని విద్యను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘురామయ్య, ఉపాధ్యాయులు పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

మనుబోలు, జూన్ 20: మండలంలోని రైతాంగానికి పిల్లిపెసర విత్తనాలను గురువారం పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి జహీర్ తెలిపారు. పిడూరు, చెర్లోపల్లి, అక్కంపేట, వీరంపల్లి రైతుభరోసా కేంద్రాలలో రైతులకు బయోమెట్రిక్ పద్ధతిలో విత్తనాలను అందించారు.

శివాలయంలో సోమిరెడ్డి తనయుడి పూజలు

వెంకటాచలం, జూన్ 20 : సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపొందిన సందర్భంగా ఆయన తనయుడు, సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మండలంలోని పూడిపర్తిలోని శివాలయంలో గురువారం సాయంత్రం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

గుంతల పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


రోడ్డు పనులు చేస్తున్న టీడీపీ నాయకులు

సైదాపురం, జూన్ 20: రోడ్డు ఇలా ..ప్రయాణం సాగేదెలా గుంతలమయంగా ఉన్న బస్టాండ్ సెంటర్ అని బుధవారం ప్రచురితమైన ఆంధ్రజ్యోతి కథనంకు సైదాపురం టీడీపీ పట్టణ అధ్యక్షుడు వరిగొండ సురేంద్ర గురువారం స్పందించారు. సొంత నిధులతో గుంతలను పూడ్చాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెయిన్ బజారు రోడ్డుపై భారీగా గుంతలు ఉన్నందున ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, దాన్ని నివారణకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రోడ్డు గుంతలు పూడ్చడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొక్కాల ప్రసాద్, కోటయ్య నాయుడు, ఆవుల చిట్టిబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు చాంద్‌ఖాసీం ఉన్నారు.

క్షయరహిత రాష్ట్రంగా మార్చేందుకు సహకరించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర క్షయ నివారణ అధికారి డాక్టర్ రమేష్

మనుబోలు, జూన్ 20: అరవై ఏళ్ళు పైబడిన ప్రతి ఒక్కరికీ వైద్య సిబ్బంది బీసీజి వ్యాక్సిన్ వేయాలని, క్షయరహిత రాష్ట్రంగా మార్చేందుకు సహకరించాలని రాష్ట్ర క్షయ నివారణ అధికారి డా. కే రమేష్ సూచించారు. మండలంలోని మడమనూరు, చెర్లోపల్లి, మనుబోలు-2 సచివాలయాలలో ఉన్న విలేజ్ వెల్‌నెస్ సెంటర్‌లను ఆయన తన బృందంతో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎంతమందికి వ్యాక్సినేషన్ జరిగింది, ఇంకెంతమంది నమోదు కావాల్సి ఉంది అన్న వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్ల వయసు నిండిన వారికే కాకుండా, ధూమపానం అలవాటు ఉన్న వారిని, గతంలో టీబి మందులు వాడిన వారిని, ప్రస్తుతం టీబి వ్యాధిగ్రస్తులను, వారితో సన్నిహిత సంబంధం ఉన్నవారిని గుర్తించి సర్వేలో నమోదు చేయాలన్నారు. వారందరికీ క్రమం తప్పకుండా వారం వారం బీసీజి వ్యాక్సిన్ వేయాలన్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. వైద్యురాలు మొహసీనా సుల్తానాకు వ్యాక్సినేషన్‌పై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయనివారణ అధికారి డా. ఖాదర్‌వలీ, కోఆర్డినేటర్‌లు శ్రావణ్, విజయ్, సూపర్‌వైజర్ మమజారుల్లా, జావిద్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



కోవూరులో యోగా సాధకుల ప్రదర్శన

కోవూరు, జూన్ 20: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. టీఎన్‌సీ జూనియర్ కళాశాల ఆవరణ నుంచి బజారు కూడలి వరకు యోగా సాధకులు ప్రదర్శన చేశారు. అనంతరం బజారు కూడలిలో మానవ హారం చేపట్టారు. ఈసందర్భంగా సత్యాన్వేషణ చైతన్య ధ్యానయోగ కేంద్ర గురువు గోళ్ళ జనార్దన్ మాట్లాడుతూ యోగాచేసే వ్యక్తులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యోగా అభ్యాసకులు ఇండ్ల రమణయ్య, ప్రసూన, సలీమ్, సురేష్, రంగారెడ్డి, జిలానీ పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ డే

కోవూరు, జూన్ 20 : రెవెన్యూ డే సందర్భంగా గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో పూర్వ తహసీల్దారు ఎస్ రామలింగేశ్వరరావు, పూర్వ ఆర్‌ఐ లక్ష్మీనారాయణలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దారు విజయశ్రీ పదవీ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు, కార్యకర్తలు

విడవలూరు, జూన్ 20 : అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పోరేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, చిన్నారులను అంగనవాడీ కేంద్రాలలో చేర్పించాలని స్థానిక అంగనవాడీ టీచర్లు ఏ లావణ్య, వై నిర్మల కోరారు. మండల కేంద్రమైన విడవలూరులో హెచ్‌డబ్ల్యూలో గురువారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోవూరు ప్రాజెక్ట్ ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపితే వారికి పోషకాహారంతో పాటు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై పెరుగుతున్న ప్రమాదాలు

● బెంబేలెత్తుతున్న వాహనదారులు, ప్రయాణికులు


జాతీయ రహదారిపై బోల్తాపడిన వాహనం (ఫైల్)

కొడవలూరు, జూన్ 20: ఇటీవల జాతీయ రహదారిపై ప్రమాదాలు పెరుగుతుండడంతో వాహనదారులు, ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. ఇటీవల మండలంలో రాచర్లపాడు నుండి రామన్నపాలెం గ్రామం పరిధిలో ప్రమాదాలు భారీగా పెరిగాయి. అతివేగం ఈ ప్రమాదాలకు కారణం కాగా, ప్రమాదాలు అరికట్టడంలో అధికారుల వైఫల్యం అనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో రాచర్లపాడు, చంద్రశేఖపురం, టపాతోపు గ్రామాల వద్ద జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. గత ఏడాదిగా పదుల సంఖ్యలో మృతిచెందగా, వందల మంది క్షతగాత్రులుగా మిగిలారు. ముఖ్యంగా చంద్రశేఖరపురం వద్ద కొద్దినెలల క్రితం ఎమ్మెల్సీ చంద్రశేఖర్ కారు బోలాపడి ఆయన తీవ్రంగా గాయపడగా, ఒకరు మృతిచెందారు. అలాగే ప్రముఖ సినీ నటుడు కత్తి మహేష్ రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృత్యువాత పడిన విషయం అందరికీ తెలిసిందే. ఇలా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో మండలంలోని చంద్ర శేఖరపురం వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు. కాగా, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ప్రతి కూడలి వద్ద ప్రత్యేక బారికేడ్లు, ఇనుప డ్రమ్ములు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎక్కడా కనిపించడంలేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారిపై ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి


మంటలు ఎగసి పడటంతో పరుగులు తీస్తున్న స్థానికులు



పేదల ఇళ్లు బుగ్గి

నెల్లూరు(క్రైం), జూన్ 20: నగరంలోని బర్మాషెల్ గుంట ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. పేదలు నివసించే 12 ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు ఎగసి పడటంతో స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. అగ్ని కీలలను ఆర్పడానికి బాధితులు, చుట్టుపక్కల వారు, అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఈ ప్రమాదంలో ఓ దివ్యాంగురాలు సజీవ దహనం కావడం అందరినీ కలచివేసింది.

మృతురాలిని చూశాను



నేను ఇంట్లో పడుకొని ఉండగా ముందు పొగలు వచ్చాయి. ఎక్కడ నుంచి వస్తున్నాయని చూసేందుకు బయటకు వస్తే ఇళ్లకు మంటలు వ్యాపించాయి. దీంతో ఇళ్లలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకు వచ్చాము. నేను వృద్ధురాలి ని ఇంటి నుంచి కష్టంగా బయటకు తీసుకువస్తున్న సమ యంలో మృతి చెందిన వికలాంగురాలు ఇంటి బయట ఉండటాన్ని గమనించాను. ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయి ఉంటుందని భావించాము. అదే ఇంట్లో మృతి చెందడం జీర్ణించుకోలేక పోతున్నాము. - చంద్ర


బాధితులను పరామర్శిస్తున్న జనసేన నాయకుడు కిషోర్ తదితరులు


అగ్నిప్రమాదంతో స్థానికులు బయటకు చేర్చుకున్న సామగ్రి

బైక్ కాలిపోయింది



మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఇంటికి వచ్చాను. రోజూ బైక్ పార్కింగ్ చేసే ప్రాంతంలో చెట్టు కింద పెట్టి ఇంట్లోకి వెళ్లాను. అన్నం తింటుండగా మా ఇంటి పక్కనే ఉన్న పూరిళ్లకు మంటలు వ్యాపిస్తున్నాయని కేకలు, అరుపులు విన్నాను. బయటకు వచ్చి చూసే సమయానికి ఇళ్లన్నీ మంటల్లో కాలిపోతున్నాయి. ఆర్పేందుకు ప్రయ త్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. నా బైక్ వద్దకు వెళ్లి చూడగా మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. - తేజ

జనసేన పరామర్శ

నెల్లూరు(క్రైం): నగరంలోని బర్మాషెల్ గుంటలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులను జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పరామర్శించారు. ప్రమాదం జరిగిన వెంటనే మంత్రి నారాయణ స్పందించి బాధితులకు అండగా నిలిచి ఆర్థిక సాయం అందజేయడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో బాధితులకు పక్కా ఇళ్లు ఇప్పించేలా జనసేన తరఫున కృషి చేస్తామని చెప్పారు.

వచ్చేసిందనుకున్నా..



అగ్నిప్రమాదంలో మృతి చెందిన నాగలక్ష్మి నాకు బంధువు. ప్రమాదం జరిగిన సమయంలో ఆ ఇళ్లలోనే నేను ఉన్నాను. తగలబడిన ఇళ్లలో ఎవరూ లేరనుకున్నాము. నాగలక్ష్మి కోసం చుట్టుపక్కల వెతికాను. ఆమె అదే ఇంట్లో మంటల్లో కాలిపోవడం కలచివేసింది. వికలాంగురాలు అయినా అటూ ఇటూ నడుస్తూ ఉండేది. మరి, ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎందుకు చిక్కుకు పోయిందో తెలియడం లేదు. - పోతురాజు

వీపీఆర్ విద్యార్థులు సమాజ సేవకులు కావాలి

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


విద్యార్థినికి కిట్ అందచేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతి

నెల్లూరు రూరల్, జూన్ 20 : వీపీఆర్ విద్యాలయంలో చదువుకున్న విద్యార్థులు సమాజ సేవకులుగా మారాలని కోవూరు ఎమ్మెల్యే, వీపీఆర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం నెల్లూరు రూరల్‌లోని కనుపర్తిపాడు వద్దనున్న వీపీఆర్ విద్యాలయంలోని 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి సిఫార్సులు లేకుండా పేదరికమే ప్రామాణికంగా తీసుకుని వీపీఆర్ విద్యలో చదువుకునేందుకు విద్యార్థులను ఎంపిక చేస్తారని చెప్పారు. తల్లిదండ్రులు కూడా పిల్లల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన విజయం ప్రతి ఇంటి వేడుక

● జాతీయ మీడియా ప్రతినిధి అజయ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 20: ఎన్నికల్లో జనసేన పార్టీ విజయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు ప్రతి ఇంట్లో వేడుకగా చేసుకున్నారని ఆ పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి వేముల పాటి అజయ్ తెలిపారు. నగరంలోని బీవీనగర్‌లో నాగిశెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో గురువారం జనసేన పార్టీ విజయోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అజయ్ మాట్లా డుతూ పార్టీని బలోపేతం చేయడంలో అందరం భాగస్వాములం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నాయకుడు శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

శేష వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరుడు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 20 : నగరంలోని మాగుంట నగర్‌లో గల ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి శేషవాహన ఉత్సవం ఘనంగా జరిగింది. ఉదయం విశేష పూజలు, హోమాలు, ధ్వజారోహణం జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

యోగా దినోత్సవ లోగోల ఆవిష్కరణ


యోగా లోగోను ఆవిష్కరిస్తున్న కోవూరు ఎమ్మెల్యే

నెల్లూరు (విద్య), జూన్ 20 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి యోగాడే లోగోను ఆవిష్కరించారు. నగరంలోని వేమిరెడ్డి నివాసంలో గురువారం జీవన యోగ శాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం అందరూ జరుపుకోవాలని, ప్రపంచ దేశాలకు ఆదర్శనీయమైన యోగాకు ఒక ప్రత్యేక రోజు ఉండడం భారత్‌కు గర్వకారణమన్నారు. అనంతరం గిన్నిస్‌బుక్ రికార్డు సాధించిన కోవూరుకు చెందిన యోగా క్రీడాకారుడు సాధన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ప్రసన్న కుమార్, కార్యదర్శి స్వప్న, కోశాధికారి సరోజ, సభ్యులు శ్యామ్‌సింగ్, రవీంద్ర, అరుణ, సత్యం, నాగ భవాని పాల్గొన్నారు.

నేడు రామచంద్రమిషన్‌లో వేడుకలు

అంతర్జాతీయ పదో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీరామచంద్ర మిషన్, ఆయు ష్, యోగా మిత్ర మండలి, డీఎస్ఏ సంయుక్తంగా శుక్రవారం వేడుకలు నిర్వహిస్తున్నట్లు సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం వెంకటకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పొదలకూరురోడ్డు గౌతమి నగర్‌లోని శ్రీరామచంద్రమిషన్ ఆవరణలో ఉదయం 6.30 గంటల నుంచి యోగా సనాలు, ప్రాణాయామం, ధ్యాన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఆయుర్వేద, హోమియోపతి వైద్యశిబిరాలు నిర్వహించి మందు లు పంపిణీ చేస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు హాజరుకావాలని కోరారు.

పంట దిగుబడులకు మట్టిలో సారం ముఖ్యం : ఏడీఏ


మట్టిలోని సారాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు రూరల్, జూన్ 20 : పంటల సాగులో దిగుబడులు ఎక్కువగా రావాలంటే మట్టి సార వంతంగా ఉండాలని నెల్లూరు వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాసు లు అన్నారు. గురువారం ఏవో నాగమోహన్‌తో కలిసి కొండ్లపూడి, దేవరపాళెం గ్రామాల్లో భూసార పరీక్షలు నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ భూమిలో నత్రజని, భాస్వరం, పోటాషియం వంటి పోషకాలు, సూక్ష్మపోషకాల లభ్యత తెలుసుకోవాలన్నారు. వీటి మోతాదు ప్రకారం రసాయని క ఎరువుల వాడకం ఉండాలని చెప్పారు. భూసారంపై అవగాహన లేకుండా రసాయనిక ఎరువులు వాడితే మట్టి సారాన్ని కోల్పోతుందని తెలిపారు. ఆ ప్రభావం దిగుబడులపై పడుతుందని రైతులకు సూచించారు.

అర్చకులకు నిత్యావసర సరుకుల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 20 : నగరంలోని ఇస్కాన్‌సిటీ హనుమాన్ జంక్షన్ అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం 40 మంది అర్చకులకు సీతారామ ధార్మిక సేవా సంస్థ నిత్యావసర సరుకులు అందజేసింది. దాతలుగా రామిరెడ్డి రామచంద్రారెడ్డి, కమలమ్మ, వసంతకుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అర్చక సమాఖ్య జిల్లా కార్యదర్శి ఉదయగిరి వెంకటశేషాచార్యులు, సింహపురి ధార్మిక సేవా సంస్థ అధ్యక్షుడు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, సీతారామ ధార్మిక సేవా సంస్థ ప్రతినిధి అనంతబాబు, ధన్వి శ్రీనివాస్ పాల్గొన్నారు.

23న దోషనివారణ హోమాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 20 : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈనెల 23న 12 రాశులవారికి దోష నివారణ హోమాలు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు శివకుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి గణపతి హోమం, నవగ్రహ, మహాలక్ష్మీ, సుదర్శన, రుద్రం, దుర్గా, శ్రీసూక్త, వాసవీ కన్యకా పరమేశ్వరి హోమాలు జరుగుతాయని తెలిపారు.

తప్పుడు ప్రచారాలకు ఆదాల సమాధానం చెప్పాలి

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి) : 'ఎన్నికల సమయంలో నా వ్యక్తిత్వ హననానికి వైసీపీ నాయకులు పాల్పడ్డారు. నాపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేసేందుకు ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూ.2 కోట్లు ఖర్చు పెట్టినట్లు ఆయన కుడి భుజం అయిన వైవీ రామిరెడ్డే చెప్పారు. నా కుటుంబాన్ని ఛిద్రం చేయాలని అనేక కుట్ర లు పన్నారు. నా భార్య, బిడ్డలకు అసభ్యకర వీడియోలు పంపుతూ వేధించారు. అయినా నేనెప్పుడూ సహనం కోల్పోలేదు. మా కుటుంబం అంతా కుమిలి పోయాం. రాత్రుళ్లు ఒకరినొకరం పట్టుకొని ఏడ్చుకున్నాం తప్ప ఆదాల మాదిరిగా నేను తప్పుడు ప్రచారాలకు దిగలేదు. నేను జనాలకు మాత్రమే భయపడతా... బచ్చాలకు కాదు. నేను ప్రజలపై పెట్టుకున్న నమ్మకాన్ని వారు వమ్ము చేయలేదు. 35 వేల పైచిలుకు మెజారిటీతో విజయం అందించి తప్పుడు ప్రచారాలు చేసిన వారికి తగిన బుద్ధి చెప్పారు' అంటూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. గురువారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయం లో తన కుటుంబ సభ్యులకు పంపిన అసభ్య కరమైన వీడియోలను గుర్తు చేసుకొని కన్నీరు పెట్టుకున్నారు. ప్రజా స్వామ్యంలో ప్రజలు నీతిని, నిజాయితీని ఆదరిస్తారు తప్ప ఆదాల మాదిరిగా తప్పుడు ప్రచారాలు చేసేవారిని నమ్మరని వ్యాఖ్యానించారు. తనపై, తన కుటుంబంపై చేసిన తప్పుడు ప్రచారాలకు వైవీ రామిరెడ్డి బహిరంగంగా క్షమాపణలు చెప్పి పశ్చాత్తాపం చెందడం మంచి నిర్ణయమన్నారు. అయితే వీరంతా కాదని, తనపై చేసిన తప్పుడు ప్రచారాలపై ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్పందిం చాలని కోటంరెడ్డి డిమాండ్ చేశారు. రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ప్రకటించారు. ప్రజల మద్దతు సంపాదించలేని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఓటమిని ఈవీఎంలపై నెట్టడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. గతేడాది 108 నియోజకవర్గాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలోనే జరిగాయని, అప్పుడు కూడా వైసీపీ ఎందుకు ఓడిపోయిందో జగన్మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

తొలగని ఇసుకమేటలు

- 7 నెలలు దాటినా అందని సాయం
- గత సర్కారు మొక్కుబడి స్పందన
- కొత్త ప్రభుత్వంపై అన్నదాత ఆశలు



తిరుమూరు వద్ద రోడ్డు తెగి పొలాల్లో చేరిన రాళ్లు, ఇసుకమేటలు



స్వర్ణముఖి నది ఉప్పొంగడంతో గట్టుతెగి పొలాల్లోకి వెళ్లిన ఇసుకమేటలు

పంట పొలాల్లో ఇసుక మేట వేసి ఏడు నెలలయినా బాధిత రైతులను కష్టాలు వీడలేదు. సాయం అందక, అప్పులు దొరక్క ఇప్పటికీ కోలుకోలేదు. గతేడాది భారీ వర్షాలు స్వర్ణముఖినది పరివాహక ప్రాంత రైతులకు కన్నీళ్లను మిగిల్చాయి. వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం వద్ద కట్ట తెగి వరదనీరు గ్రామాన్ని చుట్టుముట్టింది. నాలుగిళ్లు నది గర్భంలో కలసిపోయాయి. ఒక భవనం సగ భాగం భూమిలోకి వెళ్లింది. నదిని ఆనుకొని ఉన్న వందల ఎకరాల్లో నాలుగు అడుగుల మేర ఇసుకమేటలు వేశాయి. వరి పంట ఇసుకపాలైంది. తిరుమూరులో 35 మీటర్ల మేర రెండు చోట్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు తెగిపోయింది. పొలాల్లో రాళ్లు, ఇసుకమేటలు చేరాయి. చిన్న, సన్నకారు రైతులు భారీగా నష్టపోయారు. గతేడాది డిసెంబరులో అప్పటి ముఖ్యమంత్రి జగన్ వాకాడు మండలంలో పర్యటించారు. నదిపై వంతెన నిర్మిస్తామని, దెబ్బతిన్నరైతులకు వెంటనే నష్టపరిహారం ఇస్తామని ప్రకటించారు.ఇప్పటికి కూడా ఆ హామీ పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు.

సాగు కష్టమై...

వరద పోటెత్తి నెలలు గడుస్తున్నా ఒకరిద్దరికి తప్ప మిగతా రైతులకు పరిహారం అందలేదు. వ్యవసాయశాఖ అధికారులు 130మంది బాధిత రైతులను గుర్తించారు. 180ఎకరాల్లో ఇసుక మేటలు ఏర్పడినట్లు నివేదిక రూపొందించారు. వాస్తవానికి ఇంతకంటే ఎక్కువమంది రైతులే నష్టపోయారు. సుమారు 1300 ఎకరాలలో సాగు దెబ్బతింది. పంట ముంపునకు గురై రైతులు బాగా నష్టపోయారు. మళ్లీ సాగుకు సిద్ధం కాలేకపోయారు. వరదసాయం అందక, బ్యాంకుల నుంచి రుణాలు పుట్టక అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఎక్కువ వడ్డీకి అప్పులు చేశామని రైతులు వాపోతున్నారు. కొత్త ప్రభుత్వమైనా ఆదుకోవాలని కోరుతున్నారు. తిరుమూరు వద్ద రోడ్డు, బాలిరెడ్డిపాళెంలో వంతెన నిర్మించి ఇసుకమేటలు తొలగించేలా చూడాలని కోరుతున్నారు.అయితే బాలిరెడ్డిపాళెంలో 18మంది రైతులకు నష్టపరిహారం అందిందని మండల వ్యవసాయాధికారిణి దీప చెప్పారు.ఆన్‌లైన్‌లో నమోదుకాని రైతులను కూడా గుర్తించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపామన్నారు.మిగిలిన రైతులకు కూడా త్వరలో పరిహారం అందుతుందన్నారు.

- వాకాడు

అభివృద్ధిపై ప్రజల ఆశలెన్నో!

నేడు అసెంబ్లీలో కొత్త ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

తిరుపతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు నేడు శాసనసభలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అనంతరం తమతమ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిపాదించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును పర్యవేక్షించే, సమీక్షించే అధికారాలను, ప్రోటోకాల్ తదితర సదుపాయాలన్నింటినీ సంతరించుకోనున్నారు.తిరుపతి నుంచీ ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి నుంచీ పులివర్తి వెంకటమణి ప్రసాద్ అలియాస్ నానీ, శ్రీకాళహస్తి నుంచీ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, సత్యవేడు నుంచీ కోనేటి ఆదిమూలం, సూళ్ళూరుపేట నుంచీ నెలవల విజయశ్రీ, గూడూరు నుంచీ పాశం సునీల్ కుమార్, వెంకటగిరి నుంచీ కురుగొండ్ల రామకృష్ణ, నగరి నుంచీ గాలి భానుప్రకాష్ ఎమ్మెల్యేలుగా గెలిచిన సంగతి తెలిసిందే. శుక్రవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ తొలి సమావేశాలకు హాజరై ప్రమాణ స్వీకారం చేయడం కోసం జిల్లా నుంచీ ఈ ఎనిమిదిమంది గురువారమే రాజధానికి పయనమయ్యారు. వీరి వెంట కుటుంబసభ్యులు, సన్నిహిత బంధుమిత్రులు, ముఖ్యనేతలు, అనుచరులు సైతం తరలి వెళ్ళారు.కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల నుంచీ జిల్లా ప్రజలు ఎంతో ఆశిస్తున్నారు. ముఖ్యంగా సాగునీటి రంగంలో అల్లూరుపాడు ప్రాజెక్టు, గాలేరు-నగరి ప్రాజెక్టు, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్, తెలుగు గంగ ప్రాజెక్టు పనులు పెండింగులో వున్నాయి. మల్లిమడుగు మొదలుకుని ఆరణియార్, కాళంగి వంటి రిజర్వాయర్ల ఆధునీకరణ పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం భూసేకరణ వేగవంతం కావాల్సి వుంది. అంతే వేగంగా పరిశ్రమల ఏర్పాటుకూ చొరవ తీసుకోవాల్సి వుంది. గడచిన ఐదేళ్ళుగా రహదారులు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. వాటి మరమ్మతులు, నిర్వహణకు అమిత ప్రాధాన్యత ఇవ్వాల్సి వుంది. చేతులు మారిన ప్రభుత్వ భూముల లెక్కలు తేల్చాల్సి వుంది. వాటిని స్వాధీనం చేసుకోవడానికి, రెవిన్యూ రికార్డులు తారుమారు చేసిన అధికారులను, ఉద్యోగులను గుర్తించి చర్యలు తీసుకోవాల్సివుంది. పర్యాటక రంగ అభివృద్ధికి అందుబాటులో వున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సి వుంది. జిల్లాకు కొత్త రూపునిచ్చే ఈ ప్రధాన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి వుంది. ఈ క్రమంలో నూతన ఎమ్మెల్యేలు చట్టసభలో జనం సమస్యలను ప్రస్తావిస్తారని, వాటి పరిష్కారాలకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారని, మైలురాళ్ళుగా నిలిచిపోయే అభివృద్ధి పనులను సాధిస్తారని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

కీలక స్థానాల్లో ...

ఉమ్మడి చిత్తూరు జిల్లా పూర్వ అధికారులకు రాష్ట్రప్రభుత్వంలో మంచి పోస్టింగులు

సీఎస్‌గా నీరబ్... సీఎం కార్యదర్శులుగా రవిచంద్ర, ప్రద్యుమ్న

పలువురు ఇతర అధికారులకు కీలక శాఖల బాధ్యత



తిరుపతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో పనిచేసిన అనేకమంది ఐఏఎస్ అధికారులు ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వంలో కీలక స్థానాల్లో నియమితులయ్యారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నీరబ్ కుమార్ ప్రసాద్ 1998లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 72వ కలెక్టర్‌గా పనిచేశారు. 2008-09 నడుమ జిల్లాకు 78వ కలెక్టర్‌గా వ్యవహరించిన ముద్దాడ రవిచంద్ర ఇపుడు సీఎం చంద్రబాబుకు ముఖ్య కార్యదర్శిగా నియమితులయ్యారు. అలాగే 2017-19 నడుమ జిల్లాకు 83వ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన పి.ఎస్.ప్రద్యుమ్న సీఎం చంద్రబాబుకు కార్యదర్శిగా పోస్టింగ్ పొందారు. ప్రద్యుమ్న ఈ కీలక బాధ్యతలకు తోడు యువజన సర్వీసులు, క్రీడలు, సాంస్కృతిక, పర్యాటక శాఖల ముఖ్యకార్యదర్శిగా అదనపు బాధ్యతలు కూడా స్వీకరించారు. గతంలో ఉమ్మడి జిల్లా డ్వామా పీడీగానూ, తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గానూ పనిచేసిన ఎం.జానకి, అలాగే ఉమ్మడి జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గానూ, తిరుపతి కమిషనర్‌గానూ పనిచేసిన వాడరేవు వినయ్ చంద్ ఆర్థిక శాఖ కార్యదర్శులుగా నియమితులయ్యారు. 2004లో జిల్లాకు 75వ కలెక్టర్‌గా పనిచేసిన జి.సాయిప్రసాద్ తాజాగా రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2014-17 మధ్య జిల్లాకు 82వ కలెక్టర్‌గా పనిచేసిన సిద్ధార్థ జైన్ ఇపుడు పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా పోస్టింగ్ అందుకున్నారు. గతంలో మదనపల్లె సబ్ కలెక్టర్‌గా పనిచేసిన అహ్మద్ బాబు ప్రస్తుతం ఉద్యాన, ఆక్వాకల్చర్, మత్స్య శాఖల కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇక టీటీడీ ఈవోగా పనిచేసిన అనిల్ కుమార్ సింఘాల్ ఇపుడు మున్సిపల్ పాలనా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఇప్పటి వరకూ తిరుపతి కలెక్టర్‌గా పనిచేసిన ప్రవీణ్ కుమార్ బదిలీపై గనులు, భూగర్భ శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ గానూ, ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ గానూ నియమితులయ్యారు. ఈ నియామకాలతో రాష్ట్రంలో జిల్లా ప్రతిష్ఠ ఇనుమడించడంతో పాటు ఆ మేరకు ప్రాధాన్యత కూడా పెరిగింది.

ప్రద్యుమ్నకు తగిన గుర్తింపు



గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు జేసీగానూ, కలెక్టర్‌గానూ పనిచేసిన పి.ఎస్.ప్రద్యుమ్నకు ఎట్టకేలకు తగిన గుర్తింపు లభించింది. జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగితే ఆయన రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. అప్పట్లో ఓట్ల లెక్కింపులో అధికార కాంగ్రెస్ పార్టీ తరపున ప్రభుత్వ పెద్దల నుంచీ తీవ్రస్థాయి ఒత్తిళ్లు వచ్చినా ఆయన వెరవకుండా నిజాయితీగా వ్యవహరించడంతో వైసీపీ మద్దతుతో పోటీ చేసిన డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి ఒక్క ఓటు తేడాతో గెలుపొందారు. ప్రభుత్వ పెద్దల మాట ఖాతరు చేయకపోవడంతో ఎన్నికలు ముగిసిన వెంటనే ఆయనను రైతు బజార్ల సీఈవోగా ప్రాధాన్యత లేని పోస్టుకు ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే 2014లో టీడీపీ ప్రభుత్వం రావడంతో ఆయన సమర్థతను, నిజాయితీని గుర్తించిన నాటి సీఎం చంద్రబాబు ఏరికోరి సొంత జిల్లాకు కలెక్టర్‌గా నియమించారు. పని చేసింది రెండేళ్ళే అయినా జిల్లాను అనేక అంశాల్లో జాతీయస్థాయిలో ఉత్తమంగా నిలిపారు. 2018లో 2.77 లక్షల మరుగుదొడ్లు నిర్మించి బహిరంగ మల విసర్జన జరగని తొలి జిల్లాగా దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులకు కూడా ఎక్కారు.అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్, తాగునీరు, టాయిలెట్ సదుపాయాలు కల్పించడంతో పాటు ఫర్నిచర్, టీవీ వంటివి సమకూర్చారు.పల్లె నిద్ర పేరిట ఒకే రోజు జిల్లావ్యాప్తంగా 2 వేల మంది ఉద్యోగులు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి అవసరమైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకున్నారు.మహిళా వర్శిటీతో ఒప్పందం కుదుర్చుకుని యశోద కార్యక్రమం పేరిట అంగన్వాడీ వర్కర్లకు మెరుగైన శిక్షణ ఇప్పించారు. బంగారుపాలెం నుంచీ నాయుడుపేట వరకూ ఇపుడున్న సిక్స్ లేన్ రోడ్డును ప్రతిపాదించింది ఆయనే.ది బెటర్ ఇండియా సంస్థ 2018లో ఎక్కువ మంది ప్రజల జీవన పరిస్థితులను ప్రభావితం చేసిన పదిమంది స్ఫూర్తిదాయక ఐఏఎస్ అధికారులను గుర్తించగా వారిలో ప్రద్యుమ్న 7వ స్థానం దక్కించుకున్నారు.ఇలాంటి అధికారికి 2019 తర్వాత తగిన గుర్తింపు లేకుండా పోయింది.ప్రాధాన్యత లేని శాఖలు కేటాయించారు. ఇటీవలి ఎన్నికల్లో గెలిచి చంద్రబాబు సీఎం కావడంతో ప్రద్యుమ్న సేవలను తగిన విధంగా వినియోగించుకునేందుకు ఆయన ఏకంగా తన కార్యదర్శిగా నియమించుకోవడం విశేషం.

చపాతీలో జెర్రి ప్రత్యక్షం !

- పీఎస్-4 హోటల్ కిచెన్ సీజ్




తిరుపతి(నేరవిభాగం), జూన్ 20 : తిరుపతిలోని పీఎస్-4 హోటల్ కిచెన్‌ను మున్సిపల్ హెల్త్ అధికారులు సీజ్ చేశారు. పుత్తూరుకు చెందిన రాజశేఖరబాబు గురువారం మధ్యాహ్నం పీఎస్4 హోటల్‌కు వచ్చాడు. భోంచేస్తుంటే చపాతిలో చనిపోయిన జెర్రి కనిపించింది. వెంటనే హోటల్ మేనేజర్‌ను పిలిచి చూపించాడు. సరైన సమాధానం రాకపోవడంతో మున్సిపల్ హెల్త్ అధికారులకు, మీడియాకు సమాచారమిచ్చాడు. మున్సిపల్ హెల్త్ అధికారి అవినాష్ రెడ్డి కిచెన్ తనిఖీ చేశారు.కూరగాయలు, ఇతర పదార్థాలు నిల్వ ఉంచడానికి అనువైన వాతావరణం లేదని గుర్తించారు. కుళ్లిన కూరగాయలు, ఆహార పదార్థాలను కూడా అక్కడ గమనించి సిబ్బందిని నిలదీశారు.జెర్రి వున్న చపాతీతో పాటు అక్కడ చెడిపోయిన కూరగాయలను, కొన్ని ఆహార పదార్థాలను పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపుతున్నట్లు మీడియాకు చెప్పారు.జాయింట్ కలెక్టర్‌కు, కమిషనర్‌కు వివరాలను నివేదించారు. కిచెన్ సీజ్ చేసి విచారిస్తున్నారు. కాగా ఈ విషయమై తిరుమల పీఏసీ(పిలిగ్రిమ్ ఎమెనిటీస్ కాంపెక్స్)-4లోని ఆహారంలో జెర్రి కనిపించిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో టీటీడీ అధికారులు స్పందించారు.తిరుపతిలోని ఆ హోటల్‌కు, టీటీడీకి ఎలాంటి సంబంధం లేదని భక్తులు గ్రహించాలని కోరారు.

తూకంలో తేడాలు

సివిల్ సప్లయిస్ గోడౌన్లలో తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 20 : జిల్లాలో అన్ని వ్యవస్థలతో పాటు సివిల్ సప్లయిస్ వ్యవస్థ సైతం గాడి తప్పింది. గత ఐదేళ్ళ కాలంలో పేద ప్రజలకు ఇచ్చే రేషన్ సరుకుల్లోనూ అవినీతి చోటు చేసుకుంది.పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల రాష్ట్రంలోని కొన్ని సివిల్ సప్లయిస్ గోడౌన్లను తనిఖీ చేసినప్పుడు పలు అక్రమాలు బయటపడ్డాయి. దీంతో అన్ని జిల్లాల్లో తనిఖీ చేసి నివేదికలు అందజేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.దీంతో జిల్లా అధికారులు నెల వారీగా లెక్కలు తీస్తున్నారు. జిల్లాలోని అంగన్‌వాడీలకు ఇక్కడినుంచే బియ్యం, కందిపప్పు, ఆయిల్ వంటివి సరఫరా చేస్తున్నారు.పంచదార, కందిపప్పు సరఫరాలో కాంట్రాక్టర్లు తూకాల్లో మోసం చేస్తున్నారని అధికారులంటున్నారు. ఒక్కో రేషన్ షాపు పరిధిలో కనీసం 10 కార్డులకు రేషన్ పంపిణీ కావడం లేదని గుర్తించారు.ఎండీయూ వాహనాలు వచ్చినప్పుడు కార్డుదారులు బయటకు వెళ్లివుంటే కందిపప్పు, బియ్యం, చక్కెర మిగిలిపోతున్నాయి. వీటికి లెక్కలు చూపడం లేదు.పేదలకు ఇస్తున్న బియ్యం, చక్కెరల్లోనూ కిలోకు 100 గ్రాములు లెక్కన తక్కువ పంపిణీ చేస్తున్నట్లు బయటపడింది.ఈ విషయమై సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ సుమతిని అడగ్గా జిల్లా వ్యాప్తంగా వున్న 12 గోడౌన్లు, మండల స్టాకు పాయింట్లలో కందిపప్పు, బియ్యం, చక్కెర స్టాకును పరిశీలించామన్నారు.తూకాల్లో తేడా వున్నమాట వాస్తవమేనని చెప్పారు. ప్రధానంగా కిలో కందిపప్పుపై 20 గ్రాముల నుంచి 50 గ్రాముల వరకు తూకం తక్కువ వున్నట్లు పరిశీలనలో తేలిందన్నారు. అలాగే చక్కెర తూకంలోనూ కిలోపై 30 గ్రాముల వరకు తక్కువున్నట్లు బయటపడిందన్నారు. ఇకపై ప్రతి నెలా నిత్యావసర వస్తువులు తనిఖీ చేసి తూకాల్లో మోసం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

25న కుప్పానికి ముఖ్యమంత్రి రాక



కుప్పం/చిత్తూరు కలెక్టరేట్, జూన్ 20: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 25, 26 తేదీల్లో కుప్పంలో పర్యటించనున్నారు.నాల్గవసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత కుప్పం రానున్న చంద్రబాబుకు టీడీపీ వర్గాలు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు ప్రారంభించాయి. తాజా విజయంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం పొంగిపొర్లుతోంది. అదే సమయంలో అధికార వర్గాల్లో గుబులు బయలుదేరింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలకు తొత్తులుగా వ్యవహరించిన వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు ఇంకా ఆయా సీట్లలోనే ఉన్నారు. అటువంటి వారు ముఖ్యమంత్రి రాకపట్ల ఆందోళనగా ఉన్నారు. ప్రభుత్వ యంత్రాంగంతోపాటు వ్యవహారాలపై పూర్తిస్థాయి పట్టున్న చంద్రబాబు ఈ అవకతవకల గురించి, ఎటువంటి అవినీతి చర్యల గురించి ప్రశ్నిస్తారో, ఏమి సమాధానం చెప్పాలో అన్న భయం వారిలో కనిపిస్తోంది.సీఎం పర్యటన ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో చర్చించేందుకు కలెక్టర్ షన్మోహన్ గురువారం అమరావతికి వెళ్లినట్లు సమాచారం. ఇక, కుప్పంలో సీఎం బస చేయనున్న ఆర్‌అండ్‌బీ అతిథిగృహ ఆధునికీకరణ పనులను అధికారులు చేపట్టారు. పాత తహసీల్దార్ కార్యాలయంలో అన్న క్యాంటీన్ పునఃప్రారంభించేందుకు అధికారులు పనులు చేస్తున్నారు.

వర్షాకాల సన్నద్ధతపై టీటీడీ ఈవో సమీక్ష



నారాయణగిరి ప్రాంతంలోని క్యూలైన్లో భక్తులకు అందజేస్తున్న కిచిడీని పరిశీలిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్20 (ఆంధ్రజ్యోతి): వర్షాకాల సన్నద్ధతపై టీటీడీ ఈవో శ్యామలరావు గురువారం గోకులం విశ్రాంతి భవనంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు.వివిధ సందర్భాల్లో భారీ వర్షాలకు బండరాళ్లు కూలి దెబ్బతిన్న రెండో ఘాట్‌రోడ్డును ఎలా పునరుద్ధరించారో అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కల్యాణి డ్యాంతో పాటు తిరుమలలో భక్తులకు ప్రధాన నీటి వనరులైన ఐదు డ్యాముల గురించి కూడా వివరించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ రూపొందించాలని ఈవో ఆదేశించారు. కొనుగోళ్లు, గిడ్డంగుల శాఖలపై సమీక్షించారు. జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, ఈఈలు సురేంద్రనాథ్ రెడ్డి, శ్రీహరి, ఎలక్ట్రికల్ డీఈ రవిశంకర్‌రెడ్డి, కొనుగోళ్ల జీఎం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.కాగా ఈవో గురువారం నారాయణగిరి షెడ్ల వద్ద వివిధ క్యూలైన్లను పరిశీలించారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌కు వెళ్లే సర్వదర్శన, స్లాటెడ్ సర్వదర్శన, ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూలైన్లను తనిఖీ చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఈవోకు పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపించింది. క్యూలైన్లలోనే వ్యర్థాలు కనిపించడంతో ఆయన సీరియస్ అయ్యారు.సంబంధిత అధికారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు.

వెంకటేశ్వరస్వామికి హనుమంత సేవ



గూడూరు అర్బన్, జూన్ 20: స్థానిక రాజా వీధిలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి తిరుచ్చి ఉత్సవం జరిపారు. రాత్రికి స్వామివారిని ప్రత్యేకం గా అలంకరించి హనుమంత వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

ఎలక్షన్ కమిషనర్‌ను కలసిన డాక్టర్ పద్మావతి



నాయుడుపేట, జూన్ 20 : ఏపీ స్టేట్ ఎలక్షన్ కమిషనర్ నీలం సహానీ, పెట్రోలియం మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ సహానీ దంపతులు నాయుడుపేటలోని రైల్వే జాతీయ అడ్వైజరీ బోర్డు మాజీ సభ్యులు డాక్టర్ పద్మావతి, డాక్టర్ కళ్యాణ్‌సింగ్ దంపతులను గురువారం కలసి మాట్లాడారు. తిరుమలలో శ్రీవారి దర్శనం చేసుకొని విజయవాడకు వెళ్తూ మార్గ మధ్యలో డాక్టర్ పద్మావతి కుటుంబసభ్యులతో కలసి మాట్లాడారు. వారి వెంట ఉమ్మడి నెల్లూరుజిల్లా మాజీ డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మావతి అన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



చిట్టమూరు, జూన్ 20 : మండల పరిధి యల్లసిరి పంచాయతీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం మాజీ సర్పంచ్ పోలిన శ్రీనివాస్ చేతుల మీదుగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కొడేపాటి గంగా ప్రసాద్ (కేజీపీ) ఫౌండేషన్ దాతృత్వంతో 4 ప్రాథమిక పాఠశాలలోని 95 మంది పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, ఇతర విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో నాగూర్‌నాయుడు, మాజీ సర్పంచ్ నాగూరయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



కోట, జూన్ 20 : మండల పరిధిలోని వంజివాకలో గురువారం తెల్లవారుజామున ఒక పూరిల్లు అగ్నికి ఆహుతైంది. స్థానికంగా ఉన్న గుండుబోయిన కృష్ణయ్య తన కుటుంబసభ్యులతో కలసి ఆరుబయట నిద్రిస్తుండగా షార్ట్ సర్క్యూట్‌లో ఇంటి నుంచి మంటలు ఎగిశాయి. స్థానికులు వచ్చి మంటలను ఆర్పినా ఆరలేదు. కోట నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలన ఎఆర్పగా అప్పటికే ఇల్లు పూర్తిగా కాలి దగ్ధమై కృష్ణయ్య కుటుంబం కట్టుబట్టలతో బయటపడింది. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి, కోనిశెట్టి రమేష్ ద్వారా రూ.20వేలు ఆ కుటుంబానికి ఇస్తున్నట్లు ప్రకటించారు.

కరుణించమ్మా....పోలేరమ్మ

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- ముగిసిన జాతర



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ, క్యూలో ఉన్న భక్తులు, మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వెంకటగిరిటౌన్, జూన్ 20: బంగారుపేట పోలేరమ్మ జాతరలో గురువారం సందడి వాతావరణం నెలకొంది. స్థానికంగా నివాసం ఉంటూ ఉద్యోగ రీత్యా బయట ఉన్నవారు కూడా జాతరలో వచ్చి పాల్గొన్నారు. బంధుమిత్రులతో కలిసి ప్రతి ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది. భక్తులు వెయ్యికళ్ల దుత్తలతో మొక్కులు చెల్లించుకున్నారు. తొమ్మిదేళ్లకు నిర్వహించే జాతరలో అశేష జన పాల్గొనడంతో పోలీసులు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. జాతరలో సంచార అంగళ్లు ఆకట్టుకున్నాయి.



దుత్తలు తీసుకుని వెళ్తున్న భక్తులు

వీధుల్లో అంగళ్లు నెలకొనడంతో చిన్నారులు కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపించారు. జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ తొమ్మిదేళ్లకు జరిగే పోలేరమ్మ జాతరకు కమిటీ నిర్వహకులు ఏర్పాట్లు బాగా చేశారన్నారు. పోలేరమ్మ దీవెనలు వెంకటగిరి ప్రజలపై ఉండాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పులికల్లు రాజేశ్వరారావు, కేవీకే ప్రసాద్‌నాయుడు, గంగాధర్, శ్రీనివాసులు, చెంగారావు, చంద్రమౌళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం : ఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

నాయుడుపేటటౌన్/తడ, జూన్ 20 : గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని జిల్లాఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెల్లడించారు. గురువారం నాయుడుపేట, తడకు వచ్చిన ఆయన మొదటగా నాయుడుపేట డీఎస్పీ కార్యాలయానికి చేరుకొని రికార్డులు పరిశీలించి అనంతరం సర్కిల్ కార్యాలయం చేరుకొని రికార్డులను పరిశీలించారు. అక్కడ నుంచి భీములవారిపాళెం చెక్‌పోస్టులను పరిశీలించారు. నేర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయిపై కఠిన వైఖరిని అవలంబించాలంటూ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఆ ప్రకారం గంజాయి వినియోగించినా, రవాణాచేసినా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని, ఆ బృందంలో ఒక సీఐతోపాటు ముగ్గురు ఎస్ఐలు, ఇతర సిబ్బంది ఉంటారని తెలిపారు. గంజాయిపై నిఘాపెట్టి రవాణాచేసే వ్యక్తులను గుర్తించి దానిని అరికట్టడమే ఈ బృందం లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా భీములవారిపాళెం చెక్‌పోస్టులోని సెబ్ విభాగంలో పలు రికార్డులను పరిశీలించారు. అక్రమ రవాణాను అరికట్టేలా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అక్కడ అధికారులను ఆదేశించారు. ఎస్పీతోపాటు డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐలు శ్రీనివాసులురెడ్డి, మధుబాబు, జగన్‌మోహన్‌రావు, ఎస్ఐలు గోపీ, నరసింహారావు ఉన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి

సూళ్లూరుపేట : పబ్లిక్ న్యూసెన్స్ తగ్గించాలనే ముఖ్య ఉద్దేశంతో విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ విష్ణువర్ధన్ రాజు అన్నారు. గురువారం ఆయన సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహభావంతో మెలిగి బాధితులకు న్యాయం చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపతామన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసుల రెడ్డి, సీఐ మధుబాబు, శ్రీహరికోట ఎస్ఐ రఘునాథ్ ఉన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

వెంకటగిరి, జూన్ 20 : వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూపేట విద్యుత్ సబ్‌డివిజన్లకు సంబంధించి విద్యుత్ లోక్ అదాలత్ సూళ్ళూరుపేటలోని షార్ మినీ బైపాస్ రోడ్డులో వున్న ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని నాయుడుపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ప్రసన్నకుమార్ తెలిపారు. గురువారం ఆయన వెంకటగిరిలో మీడియాతో మాట్లాడుతూ వినియోగదారులు తమ సమస్యలు లోక్ అదాలత్ దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

రేపు ఓజిలి మండల సమావేశం

ఓజిలి,జూన్20 : ఓజిలి మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో విద్య, వైద్య ఆరోగ్య, వ్యవసాయం, విద్యుత్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ నీటిపారుదల వంటి శాఖలపై సమీక్ష చేయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి అధికారులు, కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

చిల్లకూరు, జూన్ 20: చిల్లకూరు సచివాలయంలో గురువారం 50 శాతం రాయితీతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెంచలకోన ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ మాట్లాడుతూ రైతులు భూసారాన్ని పెంచుకుని అధిక దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వం రాయితీలో పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, మల్లికార్జున్, నవీన్‌చంద్ర, శివకుమార్, వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్, ఏవో భవానీ, సిబ్బంది శివశంకర్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల స్వచ్ఛభారత్



కోట, జూన్ 20: కోట పోలీసులు గురువారం వినూత్న రీతిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. వాకాడు సీఐ హరికృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగబాబు పలువురు పోలీసులతో కలసి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న మందుబాబులపై దాడులు నిర్వహించి వారిచేతనే చీపుర్లుపట్టి శుభ్రం చేయిస్తున్నారు.

హుస్సేనమ్మ దర్గా ఉత్సవాలు ప్రారంభం



దీపాలంకరణలో దర్గా, దర్గాలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

దొరవారిసత్రం, జూన్ 20 : దొరవారిసత్రం మండలం నెలబల్లిలోని హుస్సేనమ్మ దర్గా 54వ గంథోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు జరిగే గంథోత్సవాల్లో మొదటిరోజు దర్గా ప్రత్యేక దీపాలంకరణ, పుష్పాలంకరణ చేశారు. దర్గా ప్రాంగణం చిరు అంగళ్ళతో సందడిగా మారింది. భక్తులు కొంతమేర విచ్చేశారు. భక్తులు మొదటి రోజు దర్గా చుట్టూ ప్రదక్షణలు చేశారు. అలాగే కొంత మంది భక్తులు దర్గా ప్రాంగణంలో నిద్రించారు. భక్తులు కోసం దర్గా కమిటీ ప్రత్యేక కోలాట ప్రదర్శన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. తెల్లవారు జామున దర్గా గంధం నెలబల్లి గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు జరగనుంది.

హైవే కూడళ్ల వద్ద ఫ్లైఓవర్లు నిర్మించాలి

గూడూరు, జూన్20: జాతీయ రహదారిపై పలు కూడళ్ల వద్ద ఫ్లైఓవర్లు నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు విజయవాడ లో నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా రీజినల్ అధికారి కేఆర్ సింగ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ నీరజ్‌గుప్తాకు గురువారం విన్నవించారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ- చెన్నై జాతీయ రహదారిలో గూడూరు పోటుపాళెం, చిల్లకూరు వరగలి క్రాస్‌రోడ్డు కూడళ్ల సమీపంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కల్యాణ మండపాలు ఉన్నాయన్నారు. దీంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆయా కూడళ్ల వద్ద ట్రాఫిక్ ఇబ్బం దులతోపాటు రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. హైవేపై వెళ్లే వాహనాలకు సంబంధం లేకుండా ట్రాఫిక్ సమస్యతోపాటు ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్లు నిర్మించాలని వారిని కోరామన్నారు.



నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



గూడూరు, జూన్ 20: నింబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం డీప్యూటీఈవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు డివిజన్ పరిధిలో పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులు వసూళ్లు చేస్తూ, అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అధిక ఫీజులు వసూళ్ల చేస్తున్న, అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో శివశంకర్, కమల్, ప్రదీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

త్వరగా రాజధాని నిర్మాణం జరగాలని కోరుకున్నా

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

తిరుమల, జూన్20(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణం త్వరగా జరగాలని శ్రీవారిని కోరుకున్నట్టు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీకి కనీసం రాజధాని కూడా లేకుండా పోయిందన్నారు. తిరిగి రాజధాని నిర్మాణం కావాలని, పరిశ్రమలు భారీగా రావాలని, అభివృద్ధి పనులు ఆగమేఘాలపై జరగాలని స్వామిని ప్రార్థించానన్నారు. అన్ని రకాలుగా సీఎం చంద్రబాబు నాయుడికి ధైర్యం ఇవ్వాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	150
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	294
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6850
వెండి కిలో ధర	రూ. 92,600
వెండి ఒక గ్రాము	రూ. 94.60


నిబద్ధతకు మారు పేరు రెవెన్యూ శాఖ



విశ్రాంత వీఆర్వో రాజగోపాల్‌ను సత్కరిస్తున్న అధికారులు, నాయకులు

పెళ్లకూరు, జూన్20: రెవెన్యూశాఖ నిబద్ధతకు మారు పేరు అని.. ప్రభుత్వ విభాగాలకు తల్లిలాంటిదని తహసీల్దార్ కేవీఆర్వీ ప్రసాద్ రావు పేర్కొన్నారు. గురువారం పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో రెవెన్యూ సిబ్బంది చొరవ చూపాలన్నారు. అనంతరం విశ్రాంత వీఆర్వోలు చాగణం రాజగోపాల్, బాలచంద్రశేఖర్ రెడ్డితో పాటు సీనియర్ రైతు నల్లాడి హరినాథ్ రెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషిబాయి, వీఆర్వోలు రవిచంద్ర, సుధాకర్, తేజ, మోబీనా, వంశీ, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య నాయకులు పేరం రమేష్‌నాయుడు, దామెర ప్రసాద్‌నాయుడు, వెంకటసుబ్బయ్య, సత్యంరాజు, వేణురెడ్డి, చంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, రమణయ్య తదితరులు ఉన్నారు.







గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

తమిళ రేషన్ బియ్యం స్వాధీనం



సూళ్లూరుపేట, జూన్ 20: సూళ్లూరుపేట పట్టణం వట్రపాలెంలో అక్రమంగా నిల్వచేసిన తమిళ రేషన్ బియ్యం బస్తాలను గురువారం విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకొన్నారు. వట్రపాలెంలోని చలువాది రవి ఇంటి ఆవరణలో ప్లాస్టిక్ గోనె సంచుల్లో అక్రమంగా ఉన్న 279 బస్తాల(13,700 కిలోలు) బియ్యం నిల్వలు విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణ నాయక్, సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్య బృందం పట్టుకొన్నారు. పట్టుబడిన బియ్యం బస్తాలను సివిల్ సప్లయ్ గోదాముకు తరలించారు. చలువాది రవిపై కేసు నమోదు చేశారు.

రెవెన్యూ ఔన్నత్యాన్ని కాపాడండి

డక్కిలి : గతంలో పనిచేసిన అధికారుల పనితీరు వల్లే రెవెన్యూ శాఖ అంటే ప్రజల్లో గౌరవం ఉందని, ఆ గౌరవం మసక బారకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. డక్కిలి రెవెన్యూ కార్యాలయ ఆవరణలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూలో పనిచేసే ప్రతి ఒక్కరూ ప్రజలకు జవాబుదారీ తనంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బాలకృష్ణయ్య, ప్రచారకార్యదర్శి గుండాలు వేవర, ఎంతవోలు వెంకటేశ్వర్లు, పిన్నక జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధం

గూడూరు అర్బన్, జూన్ 20: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధమని, ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ పాపారావు అన్నారు. గురువారం పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, రైల్వేపార్శిల్ కార్యాలయం, రైల్వేస్టేషన్, బొగ్గులదిబ్బ, పీఎస్ఆర్ పార్కు, సాధుపేట తదితర ప్రాంతాలలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి తగాదాలకు దిగినా, ప్రజలకు ఇబ్బందులు కలిగించినా చట్టపరమైన చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విపత్తుల్లో రెవెన్యూ అధికారుల సేవలు కీలకం

ఆర్డీవో చంద్రముని



మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రముని

నాయుడుపేట టౌన్, జూన్ 20 : విపత్తులు తలెత్తినప్పుడు ప్రజలను రక్షించే సందర్భాలలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది కీలకంగా విధులు నిర్వహిస్తారని సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని అన్నారు. జూన్ 20వ తేదీని రెవెన్యూ డేగా ప్రభుత్వం ప్రకటించడంతో గురువారం నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూశాఖ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఆర్డీవో పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట తహసీల్దారు కళ్యాణి, డిప్యూటీ తహసీల్దారు రాజేంద్ర, ఆర్ఐలు, వీఆర్వోలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తడ : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ డేను ఘనంగా నిర్వహించారు. గురువారం కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. ప్రతిభ కనపరచిన రెవెన్యూ ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీకృష్ణ, డిప్యూటీ తహసీల్దారు శరత్ బాబు, ఆర్ఐ శ్రావణ్ పాల్గొన్నారు.

మాజీ రెవెన్యూ సిబ్బందికి సన్మానం



చిట్టమూరు, జూన్ 20: చిట్టమూరు రెవెన్యూ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవం జరుపుకొన్నారు. అన్ని గ్రామాల నుంచి రైతులను ఆహ్వానించి రెవెన్యూ రికార్డుల కూర్పు, రికార్డులో వారి భూముల వివరాలు చూపించారు. ఈ సందర్భంగా మాజీ రెవెన్యూ సిబ్బందిని తహసీల్దార్ శ్రీనివాస శర్మ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీ విజయలక్ష్మి, రీ సర్వే డీటీ నిరంజన్ కుమార్, ఆర్ఐ మధులత, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



